

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com








హైదరాబాద్ | శనివారం 6-3-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 182 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# దేశంలో తయారీ రంగాన్ని ఉరకలెత్తించాలి

**అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి**
**మేకిన్ ఇండియా ప్రోత్సాహంతో మరింత ముందుకు**
**బడ్జెట్ రూపకల్పన కూడా ఇందుకు అనుగుణంగా సాగింది**
**ప్రభుత్వ జోక్యం తగ్గించేలా చర్యలు**
**పారిశ్రామిక వేత్తలతో జరిగిన వెబ్‌నార్‌లో ప్రధాని మోడీ**

న్యూఢిల్లీ,మార్చి5(ఆర్ఎన్ఎ): దేశీయ తయారీ రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని, దీని కోసం మనమంతా కలిసికట్టుగా శ్రమించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. తయారీ రంగాన్ని బలోపేతం చేయడానికి వేగంగా, విస్తృతంగా కృషి చేయాలన్నారు. ఇందుకోసం ఉత్పాదక వ్యయం, నాణ్యత, సామర్థ్యం విషయంలో రాజీపడరాదన్నారు. తయారీ సామర్థ్యం ఎంత ఎక్కువగా ఉంటే, అంత ఎక్కువగా ఉపాధి అవకాశాలు వస్తాయని చెప్పారు. దీని కోసం తన ప్రభుత్వం సంస్కరణలు తీసుకొస్తోం దని చెప్పారు. ఉత్పాదకతతో అనుసంధానమైన ప్రోత్సాహక పథకాల గురించి పారిశ్రామికవేత్తలతో శుక్రవారం జరిగిన వెబినార్‌లో మోదీ మాట్లాడారు. గడచిన ఆరేడుసంవత్సరాల్లో 'మేక్ ఇన్ ఇండియా' ను ప్రోత్సహించేందుకు విజయవంతంగా కృషి చేసినట్లు తెలిపారు. మన దేశంలో తయారీ రంగం అంతర్జాతీయ ప్రమాణాలతో పోటీ పడాలని చెప్పారు. 'కనిష్ట ప్రభుత్వం, గరిష్ఠ పరిపాలన'పై తన ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. మాన్యుఫ్యాక్చరింగ్ రంగం ఆర్థిక వ్యవస్థలో ప్రతి అంశాన్ని మార్చుతుందని, అనేక అంశాలతో సహజీవనం చేయగలిగే వ్యవస్థను సృష్టిస్తుందని చెప్పారు. మాన్యుఫ్యాక్చరింగ్ సామర్థ్యం పెరిగితే, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయన్నారు. దీనికి ప్రపంచంలో అనేక దేశాలు ఉదాహరణగా నిలుస్తున్నట్లు వివరించారు. భారత దేశం కూడా ఇదే వైఖరితో ముందుకెళ్తోందని, తన ప్రభుత్వం ఈ రంగంలో ఒకదాని తర్వాత మరొక సంస్కరణను అమలు చేస్తోందని చెప్పారు. తన ప్రభుత్వ విధానం, వ్యూహం ప్రతి విషయంలోనూ చాలా స్పష్టంగా ఉన్నట్లు తెలిపారు. తయారీ రంగం వల్ల పర్యావరణంపై దుష్ప్రభావాలు పడకుండా, ఎటువంటి లోపాలు లేని ఉత్పత్తులు తయారు కావాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడగలిగే విధంగా మన దేశ తయారీ రంగం శ్రమించాలని కోరారు. మన ఉత్పాదక వ్యయాలు, నాణ్యత, ఉత్పత్తుల సమర్థత అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రత్యేక గుర్తింపును సాధించాలన్నారు. దీని కోసం మనమంతా కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. మన దేశ ఉత్పత్తులు తప్పనిసరిగా వాటిని ఉపయోగించేవారికి అత్యంత అనుకూలంగా, అత్యాధునికంగా, అందుబాటు ధరల్లో, స్థిరంగా నిలబడగలిగే విధంగా ఉండాలని చెప్పారు. ప్రతిదానిలోనూ ప్రభుత్వం జోక్యం చేసుకోవడం వల్ల పరిష్కారాలు లభించడం కన్నా మరిన్ని సమస్యలు ఉత్పన్నమవుతాయని తన ప్రభుత్వం నమ్ముతోం దన్నారు. అందుకే తాము స్వీయ నియంత్రణ, స్వీయ ధ్రువీకరణ, స్వీయ నిర్ధరణలను అవలంబిస్తున్నామని తెలిపారు. దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామి కావాలన్నారు. కేంద్ర బ్జడెట్, విధాన నిర్ణయాలు కేవలం ప్రభుత్వ ప్రక్రియగా మిగిలిపోకూడదన్నారు. దేశాభివృద్ధితో సంబంధం ఉన్నవారంతా దీనిలో సమగ్రంగా పాలుపంచుకోవాలన్నారు. కేంద్ర బడ్జెట్ ప్రణాళిక, దేశానికి సంబంధించిన విధాన రూపకల్పన కేవలం ప్రభుత్వ ప్రక్రియకే పరిమితం కావద్దని ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. దేశ అభివృద్ధిలో ప్రతి భాగస్వామి పాలుపంచుకోవాలని, చురుకైన పాత్ర పోషించాలనిసూచించారు. దేశంలో తయారీరంగాన్ని ఉరకలెత్తించ డానికి మనం భారీ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మన దేశ కంపెనీలు ప్రపంచ స్థాయి కంపెనీలతో పోటీపడేలా చేయడం కోసం అహర్నిశలు కృషిచేయాల్సిన అసవరం ఉందన్నారు. ఏడాదిపాటు కరోనా మహమ్మారి ప్రభావాన్ని అనుభవించి ఇప్పుడిప్పుడే కోలుకుంటు న్నందున తయారీ రంగంలో దేశాన్ని పరుగులు తీయించడం మన బాధ్యతగా భావిస్తున్నానని, ఇది కేవలం అవకాశం మాత్రమే అనుకోవడం లేదని ప్రధాని చెప్పారు. తయారీరంగం దేశ ఆర్థికవ్యవస్థలోని ప్రతి సెగ్మెంట్‌లో మార్పులు తెస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తయారీరంగంలో వరుసగా సంస్కరణలు తీసుకొస్తున్నదని, తాము కనీస ప్రభుత్వం, గరిష్ట పాలన అనే సిద్ధాంతాన్ని నమ్ముతున్నామని చెప్పారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ దేశంలోని యువత ప్రతిభను గ్రహించి మరింత పురోభివృద్ధి సాధించేందుకు దేశవ్యాప్తంగా కొన్ని పాలసీలను అమలు పర్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దీనికి రానున్న 25 ఏళ్లు ఎంతో కీలకమని ఆమె అన్నారు. ఢిల్లీలో శుక్రవారం జరిగిన ఐడబ్ల్యూపీసీ ప్రెసర్‌లో ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తాజా బడ్జెట్ ఈ విధానానికి ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. దేశాన్ని తయారీ రంగంగా చూపిస్తూనే వ్యాపార రంగానికి ప్రోత్సాహాన్ని తోడ్పాటును బడ్జెట్ అందిస్తుందని నిర్మల అన్నారు. ఉద్దీపనల లక్ష్యాన్ని ఈ బడ్జెట్ లో తాము ఆవిష్కరించగలిగామని అన్న నిర్మలా సీతారామన్.. కరోనా మహమ్మారి సమయాన్ని దీనికి సమర్థవంతంగా ఉపయోగించుకున్నట్లు తెలిపారు. ఆ సమయంలో ఏక కాలంలో సంస్కరణలు అమలు చేయడం ద్వారా తమ లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నం చేశామని ఆమె పేర్కొన్నారు.

## పాతబస్తీలో ఆకతాయిల వీరంగం

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): రాజధాని హైదరాబాద్‌లోని పాతబస్తీలో ఆకతాయిలు బీభత్సం సృష్టించారు. మద్యం మత్తులో ఉన్న కొందరు యువకులు అర్ధరాత్రి దాటిన తర్వాత కత్తులు, తల్వార్లతో వీరంగం చేశారు. ఇప్పటికే పలు నేరాలకు పాల్పడిన రౌడీషీటర్ ఖోనిగౌస్.. గతరాత్రి తన ముఠాతో కలిసి సులేమాన్‌నగర్‌లో ఐదు ఇళ్లపై దాడిచేశాడు. కత్తులు, తల్వార్లతో స్థానికులను భయభ్రాంతులకు గురిశాచేశారు. ఈ దాడిలో పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, గతంలో సాలార్‌జంగ్ మ్యూజియంలో టిఫిన్ బాక్సును గౌస్ చోరీ చేశాడు.

## కారును ఢీకొన్న ప్రైవేట్ బస్సు క్షేమంగా బయటపడ్డ కారులోని వ్యక్తులు

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): ప్రైవేట్ బస్సు ఢీకొన్న ప్రమాతంలో కారు ధ్వంసమైంది.

అయితే అదృష్టవశాత్తు కారులో ఉన్న వారు క్షేమంగా బయటపడ్డారు. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్‌కు చెందిన ఎ.జ్యోతిర్మయి కారులో ఎన్‌బీవీ సత్యనారాయణతో కలిసి ఆర్టీసీ క్రాస్ రోడ్డు నుంచి బంజారాహిల్స్‌లోని ఓ ఆస్పత్రికి వెళ్తోంది. కారు పంజాగుట్ట మోడల్ హౌస్ వద్దకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ప్రైవేట్ బస్సు కారును ఢీకొట్టింది. కారు ధ్వంసం కాగా.. అందులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనతో పంజాగుట్ట ప్రధాన రహదారిలో ట్రాఫిక్ జామ్ అయింది. వెంటనే స్పందించిన పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. జ్యోతిర్మయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బస్సు డ్రైవర్ తనను దూషించాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

# ఎస్‌హెచ్‌జీలకు ఐటీ వినియోగంపై సీఎస్ సోమేశ్ కుమార్ సమీక్ష



హైదరాబాద్, మార్చి 5: రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలకు సంబంధించి ఐటీ వినియోగం, సామర్థ్యం పెంపుదల, జీవనోపాధి, ఎంటర్‌ప్రైస్, డెవలప్‌మెంట్, కన్వర్‌జెన్సీకి కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సెర్ప్, మెప్మా చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, కార్యాచరణ ప్రణాళికలపై శుక్రవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో అధికారులతో సీఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధిలో మార్పు తీసుకురావడానికి వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, భూసార పరీక్షలు, కూరగాయల సాగు, పశుసంవర్ధకం, న్యూట్రిషన్ తదితర రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి అంశానికి సంబంధించి అధికారులతో చిన్న చిన్న బృందాలను ఏర్పాటు చేసి వివరాలతో రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఐటీ వినియోగం ద్వారా ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు నిరంతర సేవలందించాలని, ప్రతి గ్రూప్‌కు బ్యాంక్ లింకేజీ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో చిన్నారులలో మాల్ న్యూట్రీషన్, మహిళలలో అనీమియా తగ్గించడానికి ఎస్‌హెచ్‌జీలు సంబంధిత లైన్ డిపార్టుమెంట్స్ కన్వర్జెన్సీతో కృషి చేయాలని అధికారులను కోరారు.

ఈ సమావేశంలో మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్ కుమార్, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయశాఖ కార్యదర్శి బి.జనార్దన్ రెడ్డి, ఎస్సీ అభివృద్ధిశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి రోనాల్డ్ రోస్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్ కుమార్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ కమిషనర్ రఘునందన్ రావు, సీడీఎంఏ సత్యనారాయణ, లీడ్ ఐబీసీడీ ఎస్ఐఎస్డీ హెచ్‌ఆర్, భారత ప్రభుత్వం, ఉషారాణి, హార్టీకల్చర్ డైరెక్టర్ ఎల్. వెంకట్రాం రెడ్డి, అగ్రికల్చర్ మార్కెటింగ్ డైరెక్టర్ జి. లక్ష్మీబాయి, స్టేట్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ డైరెక్టర్ అఖిల్, వీ-హబ్ సీఈవో దీప్తి రేవుల, శ్రీనిధి ఎండీ జి.విద్యాసాగర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంతో సాగులోకి కోటి ఎకరాలు

**మూడేళ్లలో నిర్మించి ఆదర్శంగా నిలిచాం**
**తెలంగాణలో సాగు,తాగునీరు, కరెంట్‌లకు ప్రాధాన్యం**
**వలసవెళ్లిన వారంతా తిరిగి ఊళ్లకు చేరుతున్నారు**
**కేంద్రం ఐటిఐఆర్ ప్రాజెక్ట్ ఇవ్వకుండా మోసం చేసింది**
**తెలంగాణ ప్రాజెక్టులపై బిజెపి నోరు మెదపాలి**
**-ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మంత్రి హరీష్ రావు**

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల అయిన కాళేశ్వరం ప్రాజెక్టును మూడేండ్లలోనే పూర్తి చేసిన ఘనత సిఎం కెసిఆర్‌దని, ఇది దేశానికే ఆదర్శమని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఈ ప్రాజెక్టువల్ల కోటి ఎకరాలు సాగులోకి వచ్చాయని చెప్పారు. రైతు బాగుపడితే దేశం కూడా బాగుపడుతుందని కెసిఆర్ ముందునుంచీ చెబుతున్నారని తెలిపారు. సాగునీటి లభ్యతతో గతంలో గ్రామాలను విడిచి వెళ్లినవారు తిరిగి వస్తున్నారని వెల్లడించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తాగు, సాగు నీరు, రవాణా సౌకర్యం మెరుగవడంతోపాటు కోతలు లేని విద్యుత్ ఇస్తున్నామని.. దీంతో ఊర్లను విడిచి వెళ్లినవారు తిరిగి స్వస్థలాలకు చేరుకుంటున్నారని తెలిపారు. శంషాబాద్‌లో జరిగిన పట్టభద్రుల ఓటర్ల సమావేశంలో మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా మారిందని వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్-హైదరాబాద్-రంగారెడ్డి పట్టభద్రుల నియోజకవర్గ టీఆర్ఎస్ అభ్యర్థి సురభీ వాణీదేవిని తొలి ప్రాధాన్యతా ఓటుతో గెలిపించాలని కోరారు.

బీజేపీ వాళ్లు చాలా బాగా మాట్లాడుతున్నారని, ఐటీఐఆర్ తమవల్లే రాలేదని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. దీనిపై మంత్రి కేటీఆర్ కేంద్ర ప్రభుత్వానికి డీపీఆర్ సమర్పించారని, సీఎం కేసీఆర్ అనేకసార్లు ప్రధాని మోదీకి లేఖలు రాశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ నేతృత్వంలోని గత ప్రభుత్వం హైదరాబాద్‌తోపాటు కర్ణాటకకు ఐటీఐఆర్ ప్రాజెక్టులను మంజూరు చేసింది. అయితే తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఉంది కాబట్టి ఇవ్వలేదని అనుకుందాం. మరి కర్ణాటకకు ఎందుకు ఇవ్వలేదు. రెండింటినీ ఎందుకు రద్దు చేశారు. ఆ ప్రాజెక్టులను యూపీఏ ప్రభుత్వం ఇచ్చింది కాబట్టి. ఆ క్రెడిట్ వారికి దక్కకూడదనే ఐటీఐఆర్‌ను రద్దు చేశారా అని ఆరోపించారు. తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా బీజేపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. బ్జడెట్‌లో ఎరువులపై రూ.2.50 లక్షల సబ్సిడీ ఎత్తివేసిందని, గ్యాస్ సబ్సిడీలో కోత విధించారని చెప్పారు. రాష్ట్రానికి బ్జడెట్‌లో కోతలు, ప్రజలకు వాతలే మిగిలాయని చెప్పారు. ఎన్నికలున్న కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో మెట్రో రైలు విస్తరణకు అవకాశం ఇచ్చారు. అదేవిధంగా కర్ణాటకలోనూ మెట్రో విస్తరణకు ఆమోదం తెలిపారు. గుజరాత్‌కు బుల్లెట్‌ట్రైన్ ఇచ్చారు. తెలంగాణకు మాత్రం మొండి చేయి చూపారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మనం కట్టే పన్నుల్లో 50 శాతం కూడా తిరిగి మనకు రావడం లేదని చెప్పారు. ప్రగతి సాధించే మన రాష్ట్రం కన్నా బీహార్ వంటి రాష్ట్రాలకు బ్జడెట్‌లో ఎక్కువ నిధులు ఇచ్చారని విమర్శించారు. మనకు మూడువేల కోట్లు డెవల్యూషన్ తగ్గించారని తెలిపారు. విభజన చట్టంలో పేర్కొన్న బయ్యారం ఉక్కు, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ వంటివి ఇస్తామనిచెప్పి ఇవ్వలేదన్నారు. 'ఏడేండ్లలో బీజేపీ ప్రభుత్వం, స్థానిక బీజేపీ ఎమ్మెల్సీ ఏం చేశారని ప్రశ్నించారు. ఒక్క మంచి పని చెప్పమనండి. ఆరేండ్లలో 12 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఇచ్చారా అని ప్రశ్నించారు. బీఎస్ఎన్ఎల్‌లో ఇప్పటికే 50 శాతం మంది ఉద్యోగులను తొలగించారు. వైజాగ్ స్టీల్ ఎ÷-లాంటును అమ్మకానికి పెట్టారు. రాష్ట్రంలోని బీహెచ్ఈఎల్, బీడీఎల్ వంటి కంపెనీలను ప్రైవేటుపరం చేస్తారని' విమర్శించారు. ఉద్యోగులంతా ఒకసారి ఆలోచించాలని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుకు అప్పగించి ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు లేకుండా చేస్తుందని ఆరోపించారు. ఐటీ అభివృద్ధిలో మనం బెంగళూరును దాటి తొలిస్థానంలో ఉన్నామని చెప్పారు.

## అన్నదమ్ముల మధ్య భూ వివాదం

**అన్నను కొట్టి చంపిన తమ్ముడు**

రంగారెడ్డి,మార్చి5(ఆర్ఎన్ఎ): అన్నదమ్ముల మధ్య ఉన్న భూవివాదం అన్నను బలి తీసుకుంది. సొంత అన్నను చంపిన తమ్ముడు రాక్షసుడిగా మారాడు. జిల్లాలోని శంకర్‌పల్లి మండలం టంగుటూరు గ్రామంలో ఈ దారుణం చోటు చేసుకుంది. భూ వివాదంలో సొంత అన్నని తమ్ముడు అతి దారుణంగా కొట్టి చంపాడు. గ్రామానికి చెందిన సురగళ్ల యాదయ్య(50), తమ్ముడు పాండు రాజుల మధ్య గత కొంత కాలంగా వివాదం కొనసాగుతోంది. తాజాగా శుక్రవారం ఉదయం భూమి మధ్య గొడవ జరుగుతుండగా యాదయ్యపై పాండు.. శ్రీనివాసులు కత్తితో దాడి చేసి హతమార్చారు. అనంతరం శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో నిందితులు లొంగిపోయారు.

# మేకిన్ ఇండియా ఎంతకాలమీ మోసం

**ప్రకటనలతో ప్రజలను మభ్య పెట్టడమేనా**
**విభజన చట్టం మేరకు హామీలను విస్మరించిన కేంద్రం**
**ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా, స్కిల్ ఇండియా నినాదాలుగా మిగిలాయి**
**సీఐఐ సదస్సు వేదికగా కేంద్రంపై తెలంగాణ మంత్రి కేటీఆర్ విమర్శనాస్త్రాలు**




హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): సీఐఐ సదస్సు వేదికగా కేంద్రంపై తెలంగాణ మంత్రి కేటీఆర్ విమర్శనాస్త్రాలు సంధించారు. ఆరున్నరేళ్లలో ఒక్క ప్రాజెక్టు ఇవ్వలేకపోయారని విమర్శించారు. ఏపీ విభజన చట్టంలో పేర్కొన్న కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ ప్రాజెక్టులపై ఇప్పటి వరకు ఒక్క అడుగూ ముందుకు పడలేదన్నారు. విభజన సందర్భంగా రెండు రాష్ట్రాలకు ఇచ్చిన హామీలను అమలు పర్చలేకపోయారన్నారు. పార్లమెంట్ సాక్షిగా ఏపీ, తెలంగాణలకు మాటిచ్చారు. ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా, స్కిల్ ఇండియా గొప్ప నినాదాలని, ప్రధాని .. టీమ్ ఇండియా అంటూ గొప్పగా చెబుతుంటారని కానీ ఆచరణలో అవి కనిపించవన్నారు. తామెంతో ఆశించామని, చేయూతగా నిలవలేకపోయిందన్నారు. దిగుమతి సుంకాలు పెంచి.. మేకిన్ ఇండియా అంటే కంపెనీలు వస్తాయా? అని కేటీఆర్ కేంద్రాన్ని ప్రశ్నించారు. శుక్రవారం బేగంపేటలో సీఐఐ రాష్ట్ర వార్షిక సమావేశం జరిగింది. కార్యక్రమానికి కేటీఆర్‌తో పాటు పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మనిర్భర్ భారత్ నినాదం ఇస్తే సరిపోదు.. ఇందుకు తగిన చర్యలు కూడా చేపట్టాలన్నారు. ఇండియా టీకాల రాజధానిగా తెలంగాణ మారిందన్నారు. ఐటీ, లైఫ్ సెన్సెస్, ఫార్మా, నిర్మాణ రంగాల్లో అగ్రస్థానంలో ఉన్నామన్నారు. ఐటీ ఎగుమతులు రూ.1.40లక్షల కోట్లకు చేరాయని, స్టార్టప్‌లతో తెలంగాణ ఇన్నోవేషన్ హబ్‌గా మారుతోందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సీఎం కేసీఆర్ అనేక చర్యలు తీసుకుంటున్నారని, స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. డిఫెన్స్, ఏరోస్పేస్ రంగానికి హైదరాబాద్ నిలయంగా ఉందన్నారు. తెలంగాణకు ఇచ్చిన ఏ హామీని కేంద్రం నిలబెట్టుకోలేదని, అలాగే విభజన సమస్యలు పరిష్కరించలేదని కేటీఆర్ అన్నారు. గత ఆరేండ్లలో తెలంగాణకు ఎలాంటి ప్రత్యేక రాయితీలు ఇవ్వలేదని గుర్తు చేశారు. వరంగల్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామన్నారని, కోచ్ ఫ్యాక్టరీకి 60 ఎకరాలు అడిగితే 150 ఎకరాలు ఇచ్చామన్నారు. ఐటీఐఆర్ రద్దు చేసి తెలంగాణకు అన్యాయం చేశారని, తెలంగాణకు ఒక్క ఇండస్ట్రియల్ జోన్ ఇవ్వలేదని ఆరోపించారు. బయ్యారం ఉక్కు ఊసేలేదన్నారు. కేంద్రం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఎవరిని అడగాలని ప్రశ్నించారు. కేంద్రం ఎన్నికల కోసం కాకుండా.. ప్రజల కోసం, దేశం కోసం పని చేయాలన్నారు. రాష్ట్రం నుంచే అధిక రెవెన్యూ తీసుకుంటూ అన్యాయం చేస్తున్నారన్నారు. బుల్లెట్ రైలు గుజరాత్‌కేనా.. హైదరాబాద్‌కు అర్హత లేదా? అని ప్రశ్నించారు. పారిశ్రామికీకరణ, పారిశ్రామిక రంగంలో తెలంగాణకు జరుగుతోన్న అన్యాయంపై కేంద్ర ప్రభుత్వంపై గళమెత్తారు మంత్రి కేటీఆర్..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచే అత్యంత కీలకమైన పారిశ్రామిక రంగంలో కేంద్రం నుంచి సహాయ నిరాకరణ కొనసాగుతోందని ఆరోపించారు. నిజానికి తెలంగాణ ఒక నవజాత శిశువు వంటిది.. నూతన రాష్ట్రం తన కాళ్ల మీద తాను నిలబడడానికి, నిలదొక్కుకోవడానికి అన్ని రకాల సాయం అందించాల్సిన బాధ్యతను కేంద్రం ఆది నుంచి విస్మరించిందన్నారు. అయినా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచే అభివృద్ధి-సంక్షేమం రెండు ప్రధానమైన అంశాలుగా భావించి సీఎం కేసీఆర్ నాయకత్వంలో ముందుకుపోతున్నామన్న ఆయన.. రాష్ట్రాభివృద్ధిలో భాగంగా పారిశ్రామిక రంగానికి అత్యంత అధిక ప్రాధాన్యత ఇచ్చింది. రాష్ట్రం ఎర్పడిన తొలినాళ్లలో ఉన్న విద్యుత్ సంక్షోభం నుంచి పరిశ్రమలకు 24 గంటల పాటు కరెంటు సరఫరా అందించే స్థాయికి తెలంగాణ రాష్ట్రం చేరుకుందన్నారు.. దీంతోపాటు దేశంలో ఎక్కడా లేనివిధంగా టీఎస్ ఐపాస్ వంటి వినూత్నమైన, విప్లవాత్మకమైన పారిశ్రామిక విధానం తీసుకువచ్చి, తెలంగాణను పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చింది. ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలు తెలంగాణ బాట పట్టేలా కార్యాచరణ చేపట్టింది. దేశంలోనే కాదు, ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా సింగిల్ విండో అనుమతుల విధానం తీసుకొచ్చి, దాదాపు 15 వేల కంపెనీలు, రెండు లక్షల 12 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను తెలంగాణ

రాష్ట్రం ఆకర్షించింది. తద్వారా సుమారు 15 లక్షల ఉద్యోగాల కల్పన ఇప్పటిదాకా జరిగిందని తెలిపారు.

ఇక, తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన ప్రాజెక్టులు, పథకాలు, ప్రోత్సాహకాల విషయంలో కేంద్రాన్ని సంప్రదిస్తూనే ఉన్నాం... విజ్ఞప్తి చేస్తూనే ఉన్నాం... అయితే సమయం, సంవత్సరాలు గడుస్తున్నవే కానీ... కేంద్రం నుంచి సానుకూల స్పందన మాత్రం రావడం లేదని కేటీఆర్ విమర్శించారు. అందుకే ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం, తెలంగాణ ప్రజల కోసం మా గొంతును గట్టిగా విప్పాల్సిన అవసరం, సమయం వచ్చిందన్నారు.

## ఐటిఐఆర్‌పై ఢిల్లీలో ధర్నా చేద్దామా?

**-కెటిఆర్‌కు రేవంత్ సవాల్**

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): ఐటీఐఆర్ రాలేదని కేటీఆర్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని, ఆ ప్రాజెక్టు కోసం ఢిల్లీలో జంతర్‌మంతర్ దగ్గర ఆమరణ దీక్ష చేద్దామని రేవంత్ పిలుపునిచ్చారు. కేటీఆర్‌కు దమ్ముంటే తన సవాల్‌ను స్వీకరించాలన్నారు. మోదీ అంటే కేసీఆర్‌కు చలి జ్వరమని వ్యంగ్యాస్త్రం సంధించారు. కూకట్‌పల్లిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎంపీ రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. కేసీఆర్, మోదీ ఒకే నాణెలినికి బొమ్మాబొరుసని విమర్శించారు.లక్షా 91వేల ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు అన్యాయం చేస్తున్న మోదీతో ఎందుకు జతకట్టాడో కేసీఆర్ చెప్పాలన్నారు. విజ్ఞులైన పట్టభద్రులు ఆలోచించి ఓటు వేసి.. తమ పార్టీ అభ్యర్థి చిన్నారెడ్డిని గెలిపించాలని కోరారు.

## అందుకే పెద్ద సంఖ్యలో గురుకులాల స్థాపన : మంత్రి కొప్పుల



హైదరాబాద్, మార్చి 5 : అన్ని వర్గాల వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిదాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో గురుకులాలను నెలకొల్పారని మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. మైనారిటీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ 7వ పాలక మండలి సమావేశం శుక్రవారం నగరంలోని బంజారాహిల్స్‌లో గల సొసైటీ ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ఛైర్మన్ హోదాలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, మైనారిటీ సంక్షేమశాఖల మంత్రి కొప్పులఈశ్వర్ అధ్యక్షత వహించారు. పాలక మండలి సభ్యుడి హోదాలో హోంమంత్రి మహమూద్ అలీ, మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎ.కె.ఖాన్, మైనారిటీశాఖ కార్యదర్శి నదీమ్ అహ్మద్,ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి షానవాజ్ ఖాసీం, మైనారిటీ గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కొప్పులఈశ్వర్ మాట్లాడుతూ.. రాష్ట్ర గురుకులాలు వినూత్న పద్ధతిలో కొనసాగుతూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. మంచి ఫలితాలు సాధిస్తూ ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటున్నాయన్నారు. దీంతో సీట్లకు డిమాండ్ బాగా పెరిగిందన్నారు. సమావేశం సందర్భంగా మైనారిటీ గురుకులాలకు చెందిన 121 పాఠశాలలను కళాశాలలుగా సీఎం ఆమోదం తీసుకుని అప్ గ్రేడ్ చేయాలని పాలక మండలి తీర్మానించింది. జాతీయ పోటీ పరీక్షల్లో విద్యార్థినీ విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలు చాటే విధంగా 10 పాఠశాలలను సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దేందుకు మండలి ఆమోదం తెలిపింది. వీటిలో ఐదు స్కూల్స్ బాలురు, మరో ఐదు స్కూల్స్ బాలికలకు చెందినవిగా తెలిపారు. ఆదిలాబాద్, జహీరాబాద్, నిర్మల్, నిజామాబాద్‌లలో కొత్తగా కట్టిన పాఠశాలల భవనాలను తొందరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు.

హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. మైనారిటీలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన వాళ్లు విద్యావంతులై జీవితంలో ఉన్నతంగా ఎదగాలనే సదాశయంతో సీఎం కేసీఆర్ గురుకుల విద్యా సంస్థలను ప్రారంభించి, వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారన్నారు. ఈ గురుకులాలలో ఇంగ్లీష్ మీడియంలో ఉచిత విద్యతో పాటు పోషకాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. విదేశాలలో ఉన్నత విద్యా కోర్సులు అభ్యసించేందుకు గాను ఒక్కొక్కరికి రూ. 20 లక్షల రూపాయల చొప్పున ఉచితంగా అందజేస్తున్నట్లు వెల్లడించారు. గురుకుల విద్యా సంస్థలను తెలంగాణ ప్రజలు గర్వించేలా గొప్పగా తీర్చిదిద్దుతున్న షఫీవుల్లా, ప్రవీణ్ కుమార్ లను మంత్రులు ఈ సందర్భంగా అభినందించారు. అదేవిధంగా జాతీయ స్థాయి క్రీడల్లో పతకాలు సాధించిన మైనారిటీ గురుకులాలకు చెందిన 10 మంది విద్యార్థులను మంత్రి కొప్పుల ఈశ్వర్ సత్కరించి, శుభాభినందనలు తెలియజేశారు.

## చరిత్రలో నేటినిజం



( మార్చి 6 సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు జయంతి..)

-రాధశ్రీ
సెల్: 9494481210



## ప్లాట్‌ఫామ్ టిక్కెట్ ధరలకు రెక్కలు

**ఏకంగా 30కి పెంచిన రైల్వే శాఖ**
**రద్దీని తగ్గించేందుకే అని సమర్థన**

న్యూఢిల్లీ,మార్చి5(ఆర్ఎన్ఎ): ఇండియన్ రైల్వేస్ ప్లాట్‌ఫామ్ టికెట్‌ను భారీగా పెంచింది. ఇప్పటి వరకూ రూ.10గా ఉన్న ప్లాట్‌ఫామ్ టికెట్‌ను రూ.30కి పెంచింది. ఈ టికెట్ తీసుకున్న వాళ్లు రెండు గంటల పాటు ప్లాట్‌ఫామ్‌పై ఉండటానికి అవకాశం ఉంటుంది. ప్లాట్‌ఫామ్ టికెటే కాదు.. లోకల్ రైళ్ల టికెట్లను కూడా భారీగా పెంచింది. లోకల్ రైళ్లలో ఇక నుంచి కనీస ఛార్జీ రూ.30గా నిర్ణయించారు. కరోనా మహమ్మారి సమయంలో అనవసర ప్రయాణాలను ప్రోత్సహించకూడదన్న ఉద్దేశంతోనే ఛార్జీలను పెంచినట్లు ఇండియన్ రైల్వేస్ తెలిపింది. ప్లాట్‌ఫామ్‌పై ఎక్కువ మంది గుమిగూడకుండా చూడటం కోసమే తాత్కాలికంగా ప్లాట్‌ఫామ్ టికెట్ ధరను పంచినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ చెప్పింది. ఇలా చేయడం కొత్తేమీ కాదని, చాలా ఏళ్లుగా చేస్తూనే ఉన్నట్లు తెలిపింది. ప్రస్తుతం ఇండియన్ రైల్వేస్ దేశవ్యాప్తంగా ప్రత్యేక రైళ్లనే నడుపుతోంది. ఇప్పటి వరకూ 65 శాతం రైళ్లు మళ్లీ పట్టాలెక్కినట్లు రైల్వే శాఖ వెల్లడించింది.

# ఉక్కు ఉద్యమంతో బిజెపి కళ్లు తెరవాలి !

నేటి నిజం
శనివారం 6-3-2021

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ గత కొంతకాలంగా చేస్తున్న ప్రజాందోళన ...ప్రభుత్వాలకు ముఖ్యంగా బిజెపి పాలకులకు కనువిప్పు కావాలి. గతంలో కాంగ్రెస్ పాలకులు అనుసరించిన ప్రైవేటీకరణ విధానాలను మరింత వేగాంగా,నిస్సిగ్గుగా అమలు చేయడం ద్వారా బిజెపి తన ముసుగును తీసేసింది. బిజెపి ప్రజల కోసం పనిచేసే పార్టీ అన్న ముద్రను దూరం చేసుకుంది. పక్కా కార్పోరేట్ వ్యక్తుల కాళ్ల దగ్గర సాగిలపడిన పార్టీగా మార్చివేయడంలో మోడీ, అమిత్ షాలు విజయం సాధించారు. ఎపిలో జరుగుతున్న ఉక్కు పరిరక్షణ ఉద్యమం బిజెపి నేతలకు కనువిప్పు కావాలి. ప్రజల్లో ఉన్న ఆందోళనలను పట్టించుకోకుంటే మూల్యం చెల్లించుకోక తప్పదని తరవాత అయినా గుర్తించక తప్పని పరిస్థితులు రాకమానవు. విశాఖ నుంచే ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమానికి నాంది కానుంది. గతంలో ప్రైవేటీకరణతో ఏం సాధించారో ప్రభుత్వాలు లెక్కలు చెప్పాలి. గతంలో అనేక సంస్థలను ప్రైవేటీకరిస్తే వచ్చిన లాభాలు...ఎంత మేరకు ఉపయోగపడ్డాయి..ఎంతమందికి అదనంగా ఉపాధి కల్పించారు..జాతీయ ప్రయోజనాలకు ఏ మేర లాభం కలిగిందో కేంద్రం ప్రజలకు వివరణ ఇచ్చుకోవాలి. వ్యాపారం సర్కారు పనికాదని ప్రధాని మోడీ చేసిన ప్రకటన నిజంగా పలాయనవాదం లేదా..అసమర్థ నాయకత్వ విధానం తప్ప మరోటి కాదు. ప్రైవేటీకరణతోనే పురోభివృద్ధి అనుకుంటే అందులో ప్రజల పాత్ర ఎంతో తేలాలి. దానివల్ల ప్రజలకు ఏ విధంగా మేలు చేస్తారో చెప్పాలి. ముఖ్యంగా బడుగు, బలహీనవర్గాలకు ఏ మేరకు ఉపయోగమో చెప్పాలి. వెనుకబడిన కులాల భాగస్వామ్యం ఏమి టో, ప్రైవేటీకరణలో వారి పాత్ర ఏమిటో కూడా తేల్చాలి. ప్రభుత్వం నిర్వహణలో సంస్థలు ఉన్నప్పుడే సామాన్యులకు లబ్ది చేకూరుతుంది. వారికి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు దక్కుతాయి. ప్రైవేటీకరణ చేస్తూ పోతే ఈ వర్గాలు మరింతగా అధఃపాతాళానికి తొక్కబడతారు. ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా సామాజిక వివక్షను ప్రభుత్వాలు, ప్రభుత్వరంగ సంస్థలే తొలగించలేకపోయాయి. ఇక ప్రైవేట్ రంగంలో అలాంటి వాటిని ఏ మాత్రం ఆశించలేమని గుర్తుంచుకోవాలి. ప్రైవేటీకరణ మంత్రం పఠిస్తున్న ప్రధాని మోడీ ఇది తమ విధానమని ఇప్పుడు జరగ బోతున్న రాష్ట్రాల్లో అధికారికంగా ప్రకటించాలి. ప్రజల సొమ్ముతో నిర్మించుకున్న సంస్థలను అధికారం ఉందికదా అని ఇష్టం వచ్చినట్లుగా తెగనమ్మడం సరికాదు. ఇది ఓ రకంగా పాలనా వైఫల్యంగా చూడాలి. నాయకుడి వైఫల్యంగా చూడాలి. విశాఖ ఉక్కు తమ స్వంత సొత్తు అయినట్టు తెగనమ్మేసే ముందు స్థానిక ప్రజల అభిప్రాయాలు తీసుకోవాలి. ఉద్యోగుల అభిప్రాయాలు తీసుకోవాలి. నిజానికి విశ్వాఖ ఉక్కు ప్రజల ఉద్యమంతో ఏర్పడ్డది. ఇప్పుడు అదే ప్రజలు దానిని రక్షించు కునేందుకు వీధుల్లో పడ్డారు. ప్రజల ఆందోళనలు పరిగణనలోకి తీసుకోకుంటా పాలకులకు ప్రజలు గుణపాఠం చెబుతారని గుర్తుంచుకోవాలి. కార్పోరేట్లకు దాసోహమంటే వారు ఎల్లకాలం మీ వెంటే ఉంటారని అనుకోవడానికి లేదు. వారు ఎప్పుడు తమకు అనుకూలంగా ఎవరు ఉంటారో అటు ప్లేటు ఫిరాయిస్తారు. ఇవాళ మోడీ వెనక ఉన్నవారంతా గతంలో కాంగ్రెస్ వెనకన ఉండి చక్రం తిప్పినవారే అని గుర్తించాలి. పాలకుల నిర్ణయాలు ఎప్పుడూ ప్రజలకు మేలుచేసేవిగా ఉండాలే తపస్ప వారిని దెబ్బతీసేలా ఉండకూ డదని గుర్తుంచుకోవాలి. ఇక విశాఖ ఉక్కు విషయం తీసుకుంటే ...విశాఖ ఉక్కు కోసం కేంద్రం పెట్టిన పెట్టుబడి రూ.5000 కోట్లు మాత్రమే. దానికి ప్రతిగా పన్నులని, డివిడెండ్లని రకరకాలుగా విశాఖ ఉక్కు నుండి ప్రభుత్వం రూ.46,000 కోట్లకు పైగా తిరిగి తీసుకున్నట్లు ఉజ్జాయింపుగా లెక్కలు చెబుతున్నాయి. ఇకపోతే విశాఖ ఉక్కు కోసం భూములిచ్చిన ప్రజలకు ఆనాడు ఎకరానికి ఇచ్చినది రూ.20,000 మాత్రమే. ఈ రోజు స్టీలు ప్లాంటు భూముల విలువ రూ. లక్ష కోట్లకు పైగా ఉంటుందని మార్కెట్ అంచనా. మరి రూ.5000 కోట్లు పెట్టుబడి పెట్టిన ప్రభుత్వానికి రూ.46,000 కోట్లు దక్కితే, 22,000 ఎకరాల భూములిచ్చిన ప్రజానీకానికి ఎంత దక్కాలి? వారికి విశాఖ ఉక్కులో ఉన్న హక్కుతో పోల్చితే కేంద్ర ప్రభుత్వానికి ఉన్న హక్కు ఎంత? అన్నది ఆలోచన చేయాలి. అలా చేస్తే విశాఖ ఉక్కు కోసం మోడీ ప్రభుత్వం చేసినదేమిటన్నది ఇక్కడ ముఖ్యం. బిజెపి అధికారం లోకి వచ్చాక విశాఖ ఉక్కులో ఏమైనా పెట్టుబడి పెట్టిందా? అన్నది తేల్చాలి. విశాఖ ఉక్కుకు స్వంత గనులను కేటాయించమని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోకుండా దానిని అమ్మకానికి పెట్టడం వెనక పెద్ద కుట్ర దాగి ఉందని అర్థం అవుతోంది. కార్పొరేట్లకు ప్రభుత్వరంగ సంస్థలను అప్పనంగా కట్టబెడుతూ..అమూల్యమైన గనులను కట్టబెట్టడానికి మాత్రమే తోడ్పడే మైనింగ్ విధానాన్ని తెచ్చారు. విశాఖ ఉక్కుకు స్వంత గనులను కేటాయించడానికి ముందుకు రకాపోవడంలోనే ఈ కుట్ర దాగి ఉంది. పోస్కోకు విశ్వాఖ ఉక్కును కట్టబెట్టడం వెనక ఉన్న వ్యాపార లావాదేవీలు బయటకు రావాలి. విశాఖ ఉక్కును ఏదోవిధంగా కబళించే ఆలోచనలే తప్ప పరిరక్షించి బలోపేతం చేసే ప్రణాళికలపై బిజెపి ఎప్పుడూ దృష్టి పెట్టలేదని గుర్తుంచుకోవాలి. విశాఖ ఉక్కు కోసం అమరులైన 32 మంది త్యాగమూర్తులది ఈ విశాఖ ఉక్కు. వారికి అసలు విలువ కట్టగలిగే దమ్ము ఉందా? వేల ఎకరాల భూములను, తమ కుటుంబాలు తరతరాలుగా బతుకుతున్న ఆ భూములను విశాఖ ఉక్కు కోసం అప్పజెప్పిన వేలాది నిర్వాసితులది ఈ విశాఖ ఉక్కు. ఆ కుటుంబాల త్యాగం ఇప్పుడు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే హక్కు ఎవరు ఇచ్చారు. తమ రెక్కల కష్టంతో విశాఖ ఉక్కును ఉక్కు కార్మికులు. నడిపిస్తున్నారు. ఆసియా ఖండంలోనే విశిష్టమైన ప్లాంట్‌గా పేరు తెచ్చిపెట్టారు. ఆ ప్లాంట్ నడుపుతూ, ప్రమాదకరమైన జోన్‌లలో సైతం ప్రాణాలకు తెగించి శ్రమించారు. అనేకులు ప్రాణాలను కోల్పోయారు. వీటి త్యాగాలను ఎలా వెలకడతారు. విశాఖ ఉక్కు కోసం చిలుమంత సాయం చేయని బిజెపి ప్రభుత్వానికి అమ్మేసే హక్కు ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు ఇచ్చారన్న ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. ఎపి బిజెపి నాయకులను ప్రజలు నిలదీయాలి. వారు దమ్ముంటే మోడీపై ఒత్తడి తెచ్చి విశ్వాఖ ఉక్కును మరింత బలోపేతం చేసి, మరింతమందికి ఉపాధి చూపే సంస్థగా తీర్చి దిద్దాలి. అప్పుడే బిజెపిది సమర్థ నాయకత్వమని, దేశానికి అవసరమని ప్రజలు విశ్వసిస్తారు.

## వరిపైనే మళ్లీ రైతుల ఆశలు

### -ధాన్యం కొనుగోళ్ల కోసం ఎదురుచూపు

నిర్మల్,మార్చి5(ఆర్ఎన్ఎ): జిల్లావ్యాప్తంగా 90 వేల ఎకరాల్లో ఈ సారి వరిపంటను రైతులు సాగుచేశారు. 2,11,439 మెట్రిక్ టన్నుల పంటల దిగుబడి లక్ష్యాన్ని నిర్ధారించారు. అయితే వరిపంట ఆశాజనకంగా కనిపిస్తుండడంతో రైతులు ఈ సారి తమ కరువు తీరిపోతుందని ఆనందపడుతున్నారు.ఇదిలా ఉండగా ప్రతియేటా నిర్మల్ జిల్లాలో ఖరీఫ్, రబీసీజన్‌లలో ఎక్కువగా రైతులు వరిపంటనే సాగుచేస్తుంటారు. అధికారులు పంట మార్పిడి చేయాలని సూచించినప్పటికీ సంప్రదాయంగా వస్తున్న వరి సాగుకే వారు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఖరీఫ్, రబీసీజన్‌లలో వరి దిగుబడులు పెద్దమొత్తంలో వస్తున్నందున కొనుగోలు పక్రియకు అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం మద్దతు ధరను ఆశాజనకంగా కొనసాగిస్తున్నందున రైతులు ఈ పంటపైనే ఆసక్తి చూపుతున్నారు. ఈ సారి యాసంగిలో 90 వేల ఎకరాల్లో వరిపంటను సాగుచేస్తున్న రైతులు 2,11,439 మెట్రిక్‌టన్నుల దిగుబడిని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇప్పటి వరకు సర్కారు కొనుగోలు కేంద్రాల విషయంలో క్లారిటీ ఇవ్వలేదు. మద్దతుధర ప్రకటించినప్పటికీ కొనుగోలు కేంద్రాలపై స్పష్టత లేకపోవడంతో అన్నదాతలు అయోమయానికి లోనవుతున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో కందులు, శనగపంట కొనుగోళ్ల విషయమై అధికారుల ప్రకటనలు రైతుల్లో ఆశలు నింపుతున్నాయి. అయితే మద్దతు ధర కన్నా ప్రైవేటు వ్యాపారులు చెల్లించే ధర ఎక్కువగా ఉండడంతో రైతులు ఎటువైపు మొగ్గు చూపాలో తేల్చుకోలేని పరిస్థితి ఎదురుకావచ్చంటున్నారు. కందులకు మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 6వేలు కాగా ప్రస్తుతం ప్రైవేటులో క్వింటాల్‌కు రూ. 7500 వరకు ధర పలుకుతుందని అంటున్నారు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారుల వైపే మొగ్గు చూపవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. అలాగే శనగ పంటకు మాత్రం సర్కారు మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 5100 కాగా ప్రైవేటులో రూ. 4800 వరకు ధర పలుకుతోంది. అయితే కంది పంట కొనుగోళ్లకు సంబందిత అధికారులు సిద్ధం కావాలంటూ జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే శనగపంట విషయంలో కూడా మార్కెటింగ్ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

## పోలీస్ బందోబస్తుమధ్య మల్లన్నసాగర్ పనులు

### రహస్యంగా జరపాల్సిన అవసరమేముంది
### ముంపు గ్రామాల ప్రజలకు పరిహారం ఎందుకు చెల్లించరు
### కెసిఆర్, హరీశ్ రావుల కనుసన్నల్లో పోలీస్ యంత్రాంగం
### ఏటిగడ్డ కిష్టాపూర్ వెళ్లకుండా ఎమ్మెల్యే రఘునందన్ అరెస్ట్

సిద్దిపేట,మార్చి5(ఆర్ఎన్ఎ): మల్లన్నసాగర్ ముంపు గ్రామాలైన ఏటిగడ్డ కిష్టపూర్, వేములఘాట్ గ్రామాల వద్ద కట్ట పనులు పరిశీలించడానికి పోలీసులు అనుమతి నిరాకరించారని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు మండిపడ్డారు. తాను ఆయా గ్రామాలను ఎందుకు పరిశీలంచ కూడదని ఆయన ప్రశ్నించారు. జిల్లా యంత్రాంగం కేసీఆర్, హరీష్ రావు కనుసన్నల్లో మెదులుతున్నారని విమర్శించారు. మల్లన్నసాగర్ ముంపు బాధితులకు అండగా ఏటిగడ్డ కిష్టాపూర్ వెళ్తున్న రఘునందన్ను పోలీసులు అరెస్ట్ చేసి చేర్యాల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.... ప్రాజెక్ట్ నిర్మాణాన్ని రెవెన్యూ యంత్రాంగం, పోలీస్ వారితో రహస్యంగా జరపడం దురదృష్టకరమన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు అండగా ఉండాల్సిన అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కొన్ని నెలల క్రితం తహసీల్దార్, చెక్కుల విషయంలో ఆర్డీవో జైలుకు వెళ్లిన సందర్భాలు ఉన్నాయన్నారు. దుబ్బాక నియోజకవర్గ ఎమ్మెల్యేగా తొగుట మండల ముంపు గ్రామాల ప్రజలకు నష్ట పరిహారం విషయంలో, ఎలాంటి విషయంలోనైనా వారికి అండగా ఉండి.. రుణం తీర్చుకుంటానని స్పష్టం చేశారు. రెండు, మూడు రోజుల్లో ముంపు గ్రామాల పర్యటనపై కార్యాచరణ ప్రకటించనున్నట్లు ఎమ్మెల్యే రఘునందన్‌రావు తెలిపారు. ఆ ప్రాంత ఎమ్మెల్యేగా అక్కడికి వెళితే అడ్డుకోవడం దారుణమన్నారు.

## పంచాభూతాలను కూడా అమ్మేస్తారు

### -హిందూపురంలో ఎమ్మెల్యే బాలకృష్ణ

అనంతపురం,మార్చి5(ఆర్ఎన్ఎ): పంచభూతాలను కూడా వైసీపీ అమ్మేస్తుందని ప్రభుత్వంపై హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని స్పష్టం చేశారు. కర్మాగారానికి కారాగారానికి తేడా తెలియని పార్టీ వైసీపీ అని యెద్దేవా చేశారు. కళాకారులను అడ్డుపెట్టుకొని తక్కువ ధరకే భూములు కొనుగోలు చేశారని మండిపడ్డారు. ఇసుక కొరతతో కార్మికులంతా రోడ్డున పడ్డారని బాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన అభివృద్ధి పనులే తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని, మున్సిపాల్టీలో టీడీపీ జెండా ఎగరేస్తామని ఈ సందర్భంగా బాలకృష్ణ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం ఆయన హిందూపురంలో టీడీపీ కౌన్సిల్ అభ్యర్థులతో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో చేసినఅభివృద్ధి కళ్ల ముందు కన్పి స్తోందని, వైసీపీ అధికారంలోకి వచ్చాక ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వ హయాంలోనే హిందూపురానికి శాశ్వత తాగునీరు ఇచ్చామని, కృష్ణా జలాలతో చెరువులను నింపామన్నారు. పట్టణాన్ని సుందరంగా, విద్య, వైద్యం, పారిశ్రామికాభివృద్ధి చేశామన్నారు. వైసీపీకి మున్సిపల్ ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో బుద్ధిచెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలకు జవాబుదారితనంతో ఉన్న టీడీపీకి మున్సిపల్ ఎన్నికల్లో పట్టం కట్టాలని ఓటర్లను కోరారు.

## పట్టభద్ర ఎమ్మెల్సీగా గిరిజనుడిని నిలబెట్టాం

### -అన్నిపార్టీలు అగ్రకులాలకే ఇచ్చారు: ఉత్తమ్

వరంగల్,మార్చి5(ఆర్ఎన్ఎ): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గతంలో ఏ పార్టీ ఎస్సీ, ఎస్టీలకు సీటు ఇవ్వలేదని...పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సామాజిక న్యాయం ప్రధాన లక్ష్యంగా, కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ ఈసారి ఓ గిరిజనుడికి అవకాశం కల్పించిందని..రాములు నాయక్ గెలుపు కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో రాములు నాయక్ చిత్తశుద్ధితో పనిచేశారని.. కేసీఆర్ నిరంకుశ ధోరణి నచ్చక టిఆర్ఎస్ నుంచి బయటికి వచ్చారని పేర్కొన్నారు. అన్ని పార్టీలు రెడ్డిలకే సీట్లు ఇచ్చాయని... ఒక్క కాంగ్రెస్ మాత్రమే ఎస్టీకి టికెట్ ఇచ్చిందన్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే నైతికత లేదని..ఎమ్మెల్సీగా ఆరేళ్ల పాటు నిరుద్యోగుల కోసం పని చేయలేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే పోటీ ఉందని..కోదండరాంకు ఓటు వేస్తే అది ఉపయోగం లేకుండా పోతుందని ఉత్తమ్ పేర్కొన్నారు. కేవలం డబ్బుల సంచులు.. లిక్కర్ బాటిల్స్ తో మళ్ళీ ఎమ్మెల్సీ గా గెలవాలని పల్లా చూస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ట్యాక్స్ ల వల్లనే అన్ని ధరలు పెరుగుతున్నాయని ఫైర్ అయ్యారు.

## రాజకీయ చదరంగంలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు

27 మార్చి 2021న ప్రారంభం కానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో పార్టీలు, నాయకులు చేయని ప్రయత్నాలు లేవు, పడని పాట్లు కనిపించవు. అస్సామ్ (126 సీట్లు), పశ్చిమ బెంగాల్ (294), తమిళనాడు (234), కేరళా (140) మరియు కేంద్రపాలిత ప్రాంతం పాండుచ్చేరీ(30)లలో ఎన్నికల ఫలితాలు 02 మే రోజున రానున్నాయి. ఐదేళ్ల క్రితంతో పోల్చితే నేటి ఎన్నికలలో చిత్ర విచిత్రాలు, పిరాయింపు, వాగ్దానాల సునామీలు, ఓటర్లకు గాలాలు, పరిస్థితులను అనుకూలంగా మార్చుకోవడాలు లాంటి ఆటలు బయట పడుతున్నాయి. ఐదు రాష్ట్రాలలో భాజపా పాగా వేయడానికి, సీట్లను మరియు ఓట్లను పెంచుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తూ, సాంప్రదాయ ఓటర్లను ఆకట్టుకునే ప్రయాస పడుతున్నది. 2016లో జరిగిన ఐదు రాష్ట్రాల 824 అసెంబ్లీ సీట్లలో భాజపా 64 మాత్రమే గెలిచింది. అస్సామ్‌లో ఏకంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. నేడు అస్సామ్ మరియు పశ్చిమ బెంగాల్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి ప్రభుత్వాలు ఏర్పాటు చేయడానికి భాజపా పావులు కదుపుతూ, ఇతర రాష్ట్రాలలో తన బలాన్ని పెంచుకోవడానికి ప్రణాళికలు అమలు పరుస్తున్నది. గత 14 మాసాలుగా ఢిల్లీలో జరుగుతున్న రైతుల పోరాటం కూడా అసెంబ్లీ ఎన్నికల మీద ప్రభావాన్ని చూపవచ్చు. కాంగ్రెస్ మరియు భాజపాలు జాతీయ పార్టీలైనప్పటికీ ప్రాంతీయ పార్టీలకు తోక పార్టీలుగా మారడం దేశవ్యాప్తంగా నేటి రాజకీయాలలో సాధారణమై పోయింది.

పశ్చిమ బెంగాల్‌లో 2016 ఎన్నికల్లో 3 సీట్లు మాత్రమే గెలిచిన భాజపా 2019 లోకసభ ఎన్నికల్లో 42 సీట్లకుగాను 18 యంపీ సీట్లు చేజిక్కించుకొని 40.64 శాతం ఓట్లను పొంది అనూహ్య విజయాలను నమోదు చేసింది. నేడు పశ్చిమ బెంగాల్ ఎన్నికల వైపు అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. మైనారిటీ జనాభా అధికంగా 28 -32 శాతం ఉన్న పశ్చిమ బెంగాల్‌లో తృణముల్ మరియు భాజపా అధికారంలోకి రావడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. హిందూ ఓటర్లందరినీ ఏకతాటిపైకి తేవడానికి మోదీ-షా ద్వయం ప్రత్యేక శ్రద్ధ పట్టారని తెలుస్తోంది. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలను 8 సెగ్మెంట్లుగా విభజించి నిర్వహించడాన్ని మమతా దీదీ వ్యతిరేకిస్తున్నది. అత్యంత దూకుడు స్వభావం కలిగిన మమతా బెనర్జీ నాయకత్వాన్ని చిన్న చూపు చూడడానికి ఆస్కారం లేదని భాజపా, కాంగ్రెస్ మరియు సిపియం పార్టీలకు తెలుసు. భాజపా పక్షాన కైలాస్ విజయవర్గీయ నేతృత్వంలో మమత సన్నిహితులైన తృణముల్ ప్రముఖ నాయకులను తన వైపుకు తిప్పు కోవడంలో కాషాయ పార్టీ సఫలీకృతం అవుతున్నది. మమత కోటలో ఆపరేషన్ ఆకర్ష్ అమలు పరుచుతూనే 'భాజపాతోనే బంగారు బంగ్లా' అనే నినాదంతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. కాంగ్రెస్, సిపియంల చుట్టరికం ఎన్ని ఓట్లను రాల్చుతుందో చూడాల్సి ఉంది. పశ్చిమ బెంగాల్‌లోని 23 జిల్లాల్లో 09 జిల్లాలు మాత్రమే 62 శాతం ఓటర్లను కలిగి 185 అసెంబ్లీ సీట్లను (294 సీట్లలో) కలిగి ఫలితాలను తారుమారు చేయవచ్చు. బెంగాల్‌లో దాదాపు 30 శాతం ముస్లిమ్ ఓటర్లు తృణముల్ వైపుననే ఉంటూ వస్తున్నారు. అసదుద్దీన్ ఓవైసీకి చెందిన యంఐయం పార్టీ అభ్యర్థులు పోటీ చేసిన ఎడల తృణముల్ ఓట్లకు గండి పడడం ఖాయం అంటున్నారు.

అస్సామ్ మరియు కేరళలో కూడా మైనారిటీ ఓటర్లు ఎక్కువగానే ఉన్నప్పటికీ భాజపా రాజకీయ చదరంగంతో సీట్లను, ఓట్లను కొల్లగొట్టే ప్రయత్నాలు జరుతున్నాయి. అస్సామ్‌లో సిఏఏ (సిటిజెన్‌షిప్ అమెండ్‌మెంట్స్ ఆక్ట్) మరియు యన్ఆర్‌సి (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్)లు ఎన్నికల్లో ప్రధాన అంశాలుగా నిలువనున్నాయి. అస్సామ్‌లో బంగ్లాదేశీయుల అక్రమ చొరబాట్లను కట్టడి చేసే చట్టాలు రావడం రాష్ట్రవాసులకు హితకరమైనప్పటికీ, ఈ చట్టాలతో అస్సామ్ వాసులకు కొన్ని అనుమానాలు కూడా ఉండవచ్చు. ఈ క్రమంలో జరిగిన షాహీన్ భాఘ్ అల్లర్లలో 65 మందికి పైగా మరణాలు జరిగాయి. గతంలో జరిగిన పలు సున్నిత రాష్ట్ర అంశాలు కూడా ఎన్నికల ఫలితాలపై ప్రభావాన్ని చూపే అవకాశం లేక పోలేదు. ప్రధాని మోదీ, అమిత్ షా మరియు జె పి నడ్డా అనుభవాన్ని పునాదిగా చేసుకొని భాజపా ప్రచారంలో ముందున్నది.

**(మినీ జనరల్ ఎలక్షన్లను తలపిస్తున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో)**

అనాదిగా రాజ్యమేలిన కాంగ్రెస్ మనుగడ కూడా ప్రశ్నార్థకంగా మారడం, ప్రాంతీయ పార్టీలను ఆశ్రయించడం చూస్తున్నాం.

ఈ ఐదు రాష్ట్రాలలో అధికార పార్టీకి ఓటర్ల ప్రభుత్వ వ్యతిరేక పవనాలు వీచే అవకాశాలు కూడా లేక పోలేదు. 2016లో కాంగ్రేస్-డియంకె విఫలయత్నంతో ఏఐఏడియంకె అధికారంలోకి వచ్చింది. కరునానిధి లేని డియంకె, జయలలిత లేని ఏఐఏడియంకె పార్టీల బలహీనతలను ఓట్లుగా మలుచుకోవడానికి, తమిళనాడులో తన ఉనికిని చాటుకోవడానికి భాజపా, కాంగ్రెసులు రణ నీతి రచిస్తున్నాయి. స్టాలిన్ నేతృత్వంలోని డియంకె మరియు అంతర్గత కుమ్ములాటలతో నడుస్తున్న ఏఐఏడియంకె మధ్య ప్రధాన పోరు జరిగితే, భాజపా మరియు కాంగ్రెస్‌లు తమిళ ప్రాంతీయ పార్టీల పొత్తులతోనే సర్దుకు పోవలసిన దుస్థితిలోనే ఉన్నాయనేది నిపుణుల అభిప్రాయం. చిన్నమ్మ శశికళ రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించి రాజకీయ విశ్లేషణకులను ఆశ్చర్యంలో ముంచెత్తడం కొస మెరుపు.

కరళలో యల్‌డియఫ్ ప్రభుత్వం మరో సారి తన సత్తా చాటుకోవాలని చూస్తున్న తరుణంలో ప్రభుత్వ వ్యతిరేకతను తనవైపు మలుచుకునేలా భాజపా వ్యూహాలకు పదును పెడుతున్నది. గత నాలుగు దశాబ్దాలుగా కేరళ అసెంబ్లీలో లెఫ్ట్ పార్టీల కూటమి యల్‌డియఫ్ మరియు కాంగ్రెస్‌తో కూడిన యూడియఫ్ పార్టీలు మాత్రమే ప్రభుత్వాలను ఏర్పరుస్తూ వస్తున్నాయి. కేరళలో కాంగ్రెస్‌తో లెఫ్ట్ పార్టీల మధ్య పోరు జరిగితే, ఇతర రాష్ట్రాలలో ఈ పార్టీలు కలిసి పోటీ చేయడం విచిత్రంగా తోస్తున్నది. ప్రభుత్వంలోని యల్డియఫ్‌ను ఎదుర్కోవడానికి కాంగ్రెస్ మరియు భాజపాలు శ్రమించాల్సిందే.

పాండిచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతంలోకి 33 అసెంబ్లీ సీట్లలో 3 సీట్లు నామినేటెడ్ కేటగిరీలో ఉండగా 30 సీట్లకు ఎన్నికలు జరుగనున్నాయి. పాండిచ్చేరీలో 88 శాతం తమిళం మాట్లాడే ప్రజలు ఉండగా, తెలుగు, మళయాలం, ఉర్దూ మరియు హిందీ మాట్లాడే జనులు కూడా ఉన్నారు. సియం నారాయణస్వామి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మెజారిటీ కోల్పోయిన తరుణంలో రాష్ట్రపతి పాలన విధించిన వేళ ఏప్రిల్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. కాంగ్రెస్‌తో డియంకె మరియు లెఫ్ట్ పార్టీల కూటమి అధికారంలోకి రావడానికి ప్రణాళికలు వేస్తున్నది. భాజపాతో ఏఐయన్ఆర్‌సి, ఏఐఏడియంకె మరియు ఇతర చిన్న పార్టీల కూటమి కూడా గట్టి పోటీ ఇచ్చేందుకు కృషి చేస్తున్నది.

ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాల్లో 824 యంయల్ఏలను ఎన్నుకోనున్నారు. నేటి ఫలితాలు భవిష్యత్తులో 116 యంపీ స్థానాల ఎన్నికల్లో ప్రభావాన్ని చూపనున్నాయి. కేరళ మరియు అస్సామ్‌లలో కాంగ్రెస్ భవిష్యత్తుకు ఈ ఎన్నికలు పరీక్ష పెట్టనున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో భాజపా తన ఓట్ల శాతాన్ని పెంచుకొని, బెంగాల్ మరియు అస్సామ్‌లలో అధికారాన్ని చేజిక్కించుకునే విశ్వ ప్రయత్నాలు చేయడం ఖాయంగా తోస్తున్నది. ప్రజాస్వామ్యంలో సిద్ధాంతాలు, ఎన్నికల మానిఫెస్టోల ఆధారంగా జరగాల్సిన ఎన్నికల్లో నోట్ల కట్టలు, పిరాయింపులు, మద్యం ప్రవాహాలు, అసాధ్య వాగ్దానాలు లాంటి అనారోగ్యకర అనైతిక అంశాలు ప్రధాన భూమికను నిర్వహిస్తే, ఏ పార్టీలు గెలిచినా, ప్రజలు మరియు ప్రజాస్వామ్యం ఓడిపోయినట్లే అని నమ్మాలి.



-డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## స్పష్టత లేని కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

### -ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల కోసం చూపు

కరీంనగర్,మార్చి5(ఆర్ఎన్ఎ): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై స్పష్టత కానరావడం లేదు. గతంలో లాగా ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఉండకపోవచ్చని అంటున్నారు. అయితే సిఎం కెసిఆర్ నిర్ణయంపైనే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఉంటుందని అంటున్నారు. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పౌర సరఫరాల శాఖ సన్నాహాలు ప్రారంభించింది. జిల్లా వారిగా ధాన్యం దిగుబడి, కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలపై సమాచారం సేకరించాలని ఆదేశించింది. యాక్షన్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. యాసంగి దిగుబడి అధికంగా వస్తుందనే ఆశతో రైతు లు ఎదురు చూస్తున్న క్రమంలో కొనుగోలు కేంద్రాలపై ప్రభుత్వ ప్రకటనలు అయోమయానికి గురి చేశాయి. సిరిసిల్లలో 50 వేల మెట్రిక్ టన్నులు మిల్లర్లు కొనుగోలు చేస్తే 3 లక్షల మెట్రిక్ టన్నులు పౌర సరఫ రాల శాఖ నుంచి కొనుగోలు చేయడానికి యాక్షన్ ఎ÷-లాన్ రూపొందించారు. ఏప్రిల్‌లో 75 వేల మెట్రిక్ టన్నులు, మేలో 1.50 లక్షల మెట్రిక్ టన్నులు, జూలైలో 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని అంచనా వేశారు. కొవిడ్ నేపథ్యంలో రైతులకు అందుబాటు లోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

## ఖాజీపేట రైల్ కోచ్ ఫ్యాక్టరీపై బిజెపి సమాధానం ఇవ్వాలి

### -రైల్వేల ప్రైవేటీకరణలో కనపడకుండా పోతున్న హామీ

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): ఉమ్మడి ఎపిలో అనేక ప్రభుత్వరంగ సంస్థలను మూసేసి ప్రజలను వంచించిన పాలకులు వాటి ప్రయోగాలు విఫలమయ్యాయని మాత్రం అగీకరించడం లేదు. తెలంగాణ చరిత్రతో ముడిపడిన ఆజంజాహి మిల్స్, నిజాం షుగర్స్, ఆల్విన్ వంటి వాటి పీకపిసికారు. వేలాదిమందికి ఉపాధి చూపిన ఐడిపిఎల్, ప్రాగాటూల్స్ మొదలైన వాటిని ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు మూసివేయడమో అమ్మి వేయడమో చేశారు. తెలంగాణ పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కూడా చారిత్రక స్ఫూర్తిని నిలబెట్టే చర్యలేవీ తీసుకోలేదు. పరిశ్రమల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడంలేదు. నిజాం షుగర్స్ విషయంలో ఇచ్చిన హామీని కూడా పట్టించుకోవడం లేదు. దీనికితోడు అన్నట్లుగా బిజెపి పాలకులు ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ విషయంలో నాలుక మడత వేశారు. నిత్యం ఆవేశంతో ఊగిపోతున్న బండిసంజయ్, ధర్మపురి అర్వింద్‌లు దీనిపై కనీసం మాటకూడా మట్లాడడం లేదు. పసుపుబోర్డు ఏర్పాటు హామిని కూడా విస్మరించారు. అంతేగాకుండా ఐటిఐఆర్ ప్రాజెక్టును బొందపెట్టారు. ఇవి ఎవరు ఎవరికిచ్చారన్నది పక్కన పెట్టి ప్రజల ఉపయుక్తం అన్న కోణంలో ఆలోచన చేయడం లేదు. బయ్యారం ఉక్కు హామీ పోయింది. దానిని ప్రస్తావించడం లేదు. తాజాగా కాజీపేట రైల్వే కోచ్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం మంగళం పాడిందని తేలిపోయింది. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను సైతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బుట్టదాఖలు చేస్తున్న తీరుతో బిజెపి స్థానిక నేతలు తలదించుకోవాలి. ఆవేశపూరిత, రెచ్చగొట్టే ప్రసంగాలు కట్టిపెట్టి ఫలానా పనిని తెలంగాణ కోసం చేశామనో లేదా చేయించగలిగామనో చెప్పాలి. తెలంగాణ పట్ల బిజెపి తన వ్యతిరేక వైఖరిని చాటుకుంటుంన్నదనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. తాజాగా ఒక సమాచార హక్కు పిటిషన్‌కు సమాధానం ఇస్తూ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అవసరం లేదంటూ కేంద్ర రైల్వే శాఖ మంత్రి కార్యాలయం నుంచి ఇచ్చిన సమాధానంపై మంత్రి కెటిఆర్ తీవ్రస్థాయిలోనే స్పందించారు. కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఇప్పటికే హైదరాబాద్ నగర ఐటి అభివృద్ధిని అడ్డుకునేలా ఐటిఐఆర్ ప్రాజెక్టుని రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం తాజాగా ఖాజీపేట రైల్వే ప్రాజెక్టు అవసరం లేదని స్పష్టం చేయడం వరంగల్ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసినట్టయిందని ఒక ప్రకటనలో మంత్రి కెటిఆర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే మార్చుకుని రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు దిశగా స్పష్టమైన ప్రకటన చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రకటనపై బిజెపి నేతలు సూటిగా సమాధానం చెప్పాలి. డొంకతిరుగుడు సమాధానాలతో, మడతవేసే సమాధానలతో ప్రజల కళ్లుగప్పలేరని గుర్తించాలి. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు సంబంధించి ఎంతోకాలంగా డిమాండ్ ఉన్నది. ఉమ్మడి ఎపిలోనే దీనిపై పోరాటాలు సాగాయి. రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి అవసరమైన స్థల సేకరణ కూడా పూర్తయిందని మంత్రి కెటిఆర్ కూడా తెలిపారు. బడ్జెట్‌లో రాష్ట్రంలోని రైల్వేలైన్‌లకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం కేంద్ర ప్రభుత్వ వివక్ష పూరిత వైఖరికి నిదర్శనమన్నారు. రైల్వేలనుప్రైవేట్ పరం చేసేందుకు అత్యంత ఉత్సాహంతో ముందుకు పోతున్న కేంద్ర ప్రభుత్వం కోచ్ ఫ్యాక్టరీని ఇవ్వదని తేలిపోయింది. దీనిపై ఇక బిజెపిని నిలదీస్తేనే సమస్య తేలుతుంది.

## టిటిడి నుంచి గో ఆధారిత ఉత్పత్తులు

### వచ్చిన ఆదాయంతో గో సంరక్షణకు వినియోగం
### ఏప్రిల్ 14 నుంచి యధావిధిగా ఆర్జిత సేవలు
### సేవల్లో పాల్గొనే భక్తులు కొవిడ్ నెగెటివ్ రిపోర్ట్‌తో రావాలి
### డయల్ యువర్ ఇవో కార్యక్రమంలో మాట్లాడిన జవహర్ రెడ్డి



తిరుమల,మార్చి5(ఆర్ఎన్ఎ): టీటీడీ ఆవు ఆధారిత సహజ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు నిర్ణయిం చింది. ఇందులో సబ్బులు, ధూప్‌స్టిక్స్, ఫేషియల్స్ క్రీమ్స్, హెయిర్ ఆయిల్స్ ఉన్నాయి. టీటీడీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గోసంరక్షణశాల నుంచి శ్రీవారి సేవకు పాలను వినియోగిస్తోంది. త్వరలో తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి గోవు సంబంధిత ఉత్పత్తులు ప్రారంభించునున్నట్లు ఈఓ జవహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం డయల్ యువర్ ఈఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా పలువురు భక్తుల నుంచి వచ్చిన సలహాలు సూచనలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గో ఉత్పత్తుల తయారీ కోసం టెండర్లు పిలుస్తామని పేర్కొన్నారు. తద్వారా వచ్చిన ఆదాయాన్ని గో సంరక్షణ కేంద్రానికే వెచ్చించ నున్నట్లు చెప్పారు. త్వరలోనే శ్రీవారి ఆర్జిత సేవలు ప్రారంభిస్తామని, ఏప్రిల్ 14 నుంచి సేవల్లో పాల్గొనే భక్తులు కొవిడ్ నెగెటివ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కొవిడ్ పరీక్ష చేయించుకోకుంటే ఆర్జిత సేవల్లో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వమని స్పష్టం చేశారు. అలిపిరి, తిరుమలలో మల్టీలెవల్ పార్కింగ్‌కు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఆలయాలను ఇక టీటీడీ పరిధిలోకి తీసుకోమని, ప్రముఖ ఆలయాలకు ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. కల్యాణ మండపాల లీజును మూడు నుంచి ఐదేళ్లకు పెంచుతున్నట్లు తెలిపారు. తిరుమలలో 150 విద్యుత్ బస్సులు నడిపేందుకు యత్నిస్తు న్నామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. అలాగే పూల తోటలకు అవసరమైన ఎరువులను గో ఆధారితంగా తయారుచేస్తామని చెప్పారు. ప్రస్తుతం వినూత్న ఉత్పత్తులు తయారు చేసి, మార్కెటింగ్ చేయాలని భావిస్తోంది. పాలు, పెరుగు, నెయ్యి, పేడ, గోమూత్రం విక్రయాలకు ఉపక్రమిస్తోంది. ఇందు కోసం తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయ విద్యావేత్తలు, శాస్త్రవేత్తలతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఇటీవల ఆలయ ఈఓ ఆదేశాలు జారీ చేశారు. నాగ్‌పూర్‌కు చెందిన 'గోవిజ్ఞాన్ అనుసంధన్ కేంద్రా'తో టీటీడీ సంప్రదింపులో జరుపుతోంది.

## మల్లన్న సాగర్ నిర్వాసితుల కోసం బిజెపి ఆందోళన

### ఎమ్మెల్యే రఘునందన్ రాకతో ఉద్రిక్తత
### వారికి తగిన న్యాయం చేయాలని డిమాండ్

సిద్ధిపేట,మార్చి5(ఆర్ఎన్ఎ): మల్లన్న సాగర్ నిర్వాసితులకు న్యాయం చేయాలంటూ బిజెపి చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. నిర్వాసితులను ఆదుకోకుండా ప్రభుత్వం బలవంతగా వారి భూములు గుంజుకుందని, వారికి నీడ లేకుండ ఆచేశారని ఆరోపించారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లాలోని ఏటిగడ్డ కిష్టాపూర్‌కు వెళ్తున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావును మల్లన్నసాగర్ ప్రాజెక్టు వద్ద అరెస్ట్ చేశారు. అలాగే సిద్దిపేట నుంచి కిష్టాపూర్ వెళ్లే రహదారిని మూసేసారు. దీంతో గ్రామానికి ఎవరు కూడా వెళ్లకుండా అడ్డుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూనిర్వాసితుల సమస్యలు తెలుసుకునేందుకు వెళ్తే అరెస్టు చేయడం దారుణమని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఫాంహౌజ్‌లో కూర్చుండి కాంట్రాక్టర్ల కోసం నిర్వాసితులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. గజ్వేల్, సిద్దిపేట తరహా మల్లన్నసాగర్ నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌కు గాని, ఎంపీ, ఎమ్మెల్యేకు గాని చిత్తశుద్ధి ఉంటే మల్లన్నసాగర్ కట్ట మీదికి రండి..నేను ఒక్కడినే వస్తాను... దొంగల్లాగ దారులు కాచి అరెస్టు చేయడం ఎందుకు అంటూ సవాల్ విసిరారు.

కేసీఆర్ ముఖ్యమంత్రి అయినప్పటి నుండి ప్రతీరోజు జిల్లాలో నిషేధ సెక్షన్ అమల్లో ఉండడం గమనార్హమన్నారు. సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌కు ఒక న్యాయం.. దుబ్బాకకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు.

అందుకే దుబ్బాకలో తమను ఓడగొట్టారన్నారు. తొగుటలో చీకటి ప్రజాస్వామ్యం నడుస్తోంది.. ఎందుకని నిలదీశారు. దుబ్బాకలో పోలీసులతో గొంతు నొక్కుతున్నారేమో- రానున్న అసెంబ్లీలో మాత్రం నొక్కలేరు.. అక్కడ మాట్లాడుతాను అంటూ ఎమ్మెల్యే రఘునందన్‌రావు హెచ్చరించారు. అయితే ఆందోళనకు దిగడంతో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు పోలీసులు అరెస్ట్ చేశారు. తమకు పరిహారం ఇవ్వకుండా అధికారులను ప్రాజెక్ట్ దగ్గరకు రానిచ్చేదిలేదంటూ గ్రామస్తులు గత కొన్ని రోజుల నుంచి ఆందోళనలు చేస్తున్నారు. వారికి మద్దతుగా మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ ముట్టడికి బీజేపీ పిలుపునిచ్చింది. దాంతో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ దగ్గరికి బయలుదేరాడు. దాంతో పోలీసులు ఆయనను తొగుటలో అడ్డుకొని అరెస్ట్ చేశారు. ఏటిగడ్డ కిష్టాపూర్ నిర్వాసితులకు సిద్దిపేట,గజ్వేల్ తరహాలో పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యే రఘునందన్ రావు డిమాండ్ చేశారు. కలెక్టర్, అధికారులు ప్రజాస్వామిక వాదులుగా పని చేయడం లేదని ఆరోపించారు.

దీంతో సిద్దిపేట జిల్లా తొగుట మండలం ఏటిగడ్డ కిష్టాపూర్‌లో ఉద్రిక్తత కొనసాగుతోంది. కిష్టాపూర్‌కు వెళ్లడానికి ప్రయత్నించిన బీజేపీ నేతలను పోలీసులు అరెస్ట్ చేసి దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గత రాత్రి కాంగ్రెస్ నేత చెరుకు శ్రీనివాస్‌ను అరెస్ట్ చేశారు. మల్లన్న సాగర్ కట్ట కోసం సిద్దిపేట నుంచి ఏటిగడ్డ కిష్టాపూర్‌కు వెళ్లే రోడ్డును కాంట్రాక్టర్ మూసివేస్తున్నాడు. దాంతో ఈ రోడ్డును మూసివేస్తే ఊరికి వెళ్లడం కష్టమౌతోందని.. రోడ్డు మూసివేయొద్దని గ్రామస్తులు కాంట్రాక్టరును అడ్డుకున్నారు. అంతేకాకుండా ఏటిగడ్డ కిష్టాపూర్ వాసులకు పరిహారం చెల్లించకుండానే మల్లన్న సాగర్ కట్ట నిర్మిస్తున్నారని వాపోయారు. పునరావాస కాలనీల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో గ్రామాన్ని విడిచి వెళ్లేందుకు నిర్వాసితులు ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది. అయితే గ్రామాన్ని ఎలాగైనా ఖాళీ చేయించాలన్న ఉద్దేశంతో కాంట్రాక్టర్ కట్ట నిర్మిస్తుండడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఊబకాయంతోనే అనారోగ్య సమస్యలు

**నిత్య జీవితంలో వ్యాయామం తప్పనిసరి కావాలి**

**ప్రపంచ ఊబకాయ దినోత్సవం సందర్భంగా మంత్రి ఈటెల హితవు**

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): ఊబకాయం అనేక రుగ్మతలకు మూల కారణం అని మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. టెక్నాలజీ ఒకవైపు శ్రమను తగ్గిస్తూ మనిషికి సుఖశాంతులను తీసుకురాగా మరోవైపు అనేక జబ్బులు కూడా మోసుకొచ్చిందన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక శ్రమ చేయాలనే భావన లేకుండా పోయిందన్నారు. కరోనా సమయంలో ఎక్కువమంది కరోనా బారినపడిన వారు, చనిపోయిన వారు సైతం స్థూలకాయం ఉన్న వారేనన్నారు. మార్చి 4 ప్రపంచ ఊబకాయ దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని నగరంలోని కేర్ హాస్పిటల్ బంజారాహిల్స్‌లో జరిగిన అవగాహన కార్యక్రమానికి రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రోజువారీ పనితో పాటు, వ్యాయామం చేయడం మంచిదనే అవగాహన ప్రజలకు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆరోగ్యవంతమైన యువ శక్తి లేకపోతే దేశాభివృద్ధి కుంటుబడుతుందన్నారు. పాత రోజుల్లో డబ్బులు లేనివారు గటక తినేవారు. ఉన్నవారు వరి అన్నం తినేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారిందన్నారు. ఉన్నవాళ్లు అన్నం మానేసి గటక తినే పరిస్థితి వచ్చిందన్నారు. అందుకే ఓల్డ్ ఈస్ గోల్డ్ అన్నట్టు. మన పాత వంటకాలు, సంప్రదాయాలు, ఆచారాలు కాపాడుకోవాలన్నారు. కరోనా సమయంలో మన వంటింట్లో ఉండే పోపుల పెట్టె మనల్ని కాపాడిందన్నారు. సహజ సిద్ధమైన వ్యవస్థను పాడవకుండా చూసుకోవాలన్నారు. కరోనా వైరస్ మొదటిది కాదు, చివరిది కాదు. ఏ నాటికైనా ప్రకృతే గొప్పదని మంత్రి అన్నారు.

# తెలంగాణకు అడుగడుగునా కేంద్రం అన్యాయం

**రైల్వే కోచ్ ఫ్యాక్టరీ అవసరం లేదన్న రైల్వేశాఖ**

**బిజెపి కుట్రలకు ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదని వ్యాఖ్య**

**కోచ్‌ఫ్యాక్టరీపై సానుకూలత రాకుంటే ఉద్యమించడానికి వెనకాడం**

**ఆర్టీఐ ద్వారా తెలుసుకుని మండిపడ్డ మంత్రి కెటిఆర్**

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రతిసారీ రాష్ట్రానికి అన్యాయం చేస్తూనే ఉందని, తాజాగా రాష్ట్ర పునర్ విభజన చట్టంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని సైతం తుంగలో తొక్కిందని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కెటిఆర్ విరుచుకు పడ్డారు. ఇలా మరోసారి తెలంగాణ పట్ల తన వ్యతిరేక వైఖరిని బీజేపీ చాటుకుందని అన్నారు. తాజాగా ఒక సమాచార హక్కు పిటిషన్‌కు సమాధానం ఇస్తూ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అవసరం లేదంటూ కేంద్ర రైల్వేశాఖ మంత్రి కార్యాలయం నుంచి ఇచ్చిన సమాధానంపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీపై కేంద్ర ప్రభుత్వ వైఖరి మారకుంటే టిఆరెస్ పార్టీ ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా తగిన కార్యాచరణ చేపడుతుందని మంత్రి కేటీఆర్ తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుపైన కేంద్రాన్ని టీఆర్ఎస్ ఎంపీలు ప్రశ్నిస్తారని మంత్రి కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలు కాపాడటం కోసం రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ ఈ సందర్భంగా బీజేపీని హెచ్చరించారు. ఇప్పటికే హైదరాబాద్ నగర ఐటి అభివృద్ధిని అడ్డుకునేలా ఐటిఐఆర్ ప్రాజెక్టుని రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం తాజాగా ఖాజీపేట రైల్వే ప్రాజెక్టు అవసరం లేదని స్పష్టం చేయడం వరంగల్ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసినట్టయిందని కేటీఆర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే మార్చుకుని రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు దిశగా విస్పష్టమైన ప్రకటన చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు సంబంధించి స్వయంగా సీఎం కేసీఆర్ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని స్వయంగా కలిసి విజ్ఞప్తి చేసిన విషయాన్ని, పలుమార్లు లేఖలు రాసిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ ప్రస్తావించారు. మరోవైపు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తరపున చేయాల్సిన అన్ని ప్రయత్నాలను తాము చేస్తూనే ఉన్నామన్నారు. ఇందులో భాగంగా రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి అవసరమైన స్థల సేకరణ కూడా పూర్తయిందని కేటీఆర్ తెలిపారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం అత్యంత విలువైన 150 ఎకరాల భూమిని ప్రత్యేక శ్రద్ధతో మరో ప్రభుత్వ శాఖ నుంచి సేకరించి కేంద్ర రైల్వే శాఖకు అప్పగించిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన ప్రాజెక్టుల విషయంలో పదే పదే సంప్రదింపులు జరుపుతున్నా, కేంద్రంలోని బిజెపి నుండి ఎలాంటి స్పందన లేదని, తెలంగాణకు రిక్తహస్తం చూపడం బీజేపీకి అలవాటుగా మారిందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న 8 రైల్వే లైన్లు, సర్వే దశలో ఉన్న 3 లైన్ లు, 4 నూతన రైల్వే లైన్ల ప్రతిపాదనలు, రైల్వే ఖాజీపేట వ్యాగన్ ఫ్యాక్టరీ, ఖాజీపేట రైల్వే డివిజన్ , రైల్వే యూనివర్సిటీ ఏర్పాటు వంటి డిమాండ్లకు సైతం కేంద్రం నుండి కనీస స్పందన లేదని, ప్రతిసారి బడ్జెట్‌లో తెలంగాణకు గుండు సున్నానే దిక్కవుతోందని మంత్రి అన్నారు. తాజాగా ఈ సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన డ్జెట్‌లో నూ తెలంగాణ రాష్ట్రంలోని రైల్వేలైన్ లకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం కేంద్ర ప్రభుత్వ వివక్ష పూరిత వైఖరికి నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్న బు÷–లెట్ ట్రైన్, హై స్పీడ్ రైల్వేలైన్ లకు సంబంధించి కూడా తెలంగాణకి బిజెపి తీవ్ర అన్యాయం చేసిందని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ తెలిపారు. ఇకపోతే రైల్వేలను ప్రైవేట్ పరం చేస్తూ భవిష్యత్ తరాలకు బిజెపి ద్రోహం చేస్తోందని మంత్రి కేటీఆర్ తీవ్రంగా ధ్వజమెత్తారు. భారతదేశ రవాణా వ్యవస్థకు గుండెకాయ లాంటి రైల్వే వ్యవస్థను సంపూర్ణంగా ప్రైవేటీకరణ చేసే దిశగా కేంద్రం కుటిల యత్నాలు చేస్తుందన్నారు. లాభాల్లో ఉన్న అన్ని ప్రభుత్వ కంపెనీలను చవకగా అమ్మేందుకు బిజెపి చేస్తున్న ప్రయత్నాల్లో రైల్వేను కూడా భాగం చేయడం అత్యంత బాధాకరమని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ళు, రోడ్డు విస్తరణ వంటి కార్యకలాపాలకు కావాల్సిన స్థలాన్ని అడిగితే మాత్రం తాత్సారం చేస్తోంది, కానీ ఇదే భూములను ప్రైవేటుపరం చేసేందుకు మాత్రం అత్యంత ఉత్సాహం చూపుతుందని అన్నారు. రైల్వేల ప్రైవేటీకరణ చేయడంతో దేశంలోని లక్షలాది మంది యువత భవిష్యత్తు ప్రశ్నార్థకం అయ్యే పరిస్థితి ఉందని మంత్రి కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు.

# అన్ని వర్గాలు వాణిదేవికే అనుకూలం

**ఎమ్మెల్సీగా ఆమెకే గ్రాడ్యుయేట్ల ఓటు**

**మంత్రి హరీష్ రావు వెల్లడి**

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): అన్ని వర్గాలు సురభి వాణీ దేవి అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్నాయని మంత్రి హరీశ్ రావు అన్నారు. పోయిన ఎన్నికల్లో గెలిచిన బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు పరిగి, తాండూరు, మహబూబ్ నగర్ జిల్లాల్లో గ్రాడ్యుయేట్స్‌ను కలవలేదని అక్కడి వారు చెబుతున్నారని చెప్పారు.

రాంచందర్‌రావు పట్టభద్రులను చిన్న చూపు చూశారని చెప్పారు. 2018లో ఎమ్మెల్యేగా, 2019లో ఎంపీగా పోటీ చేశారని, అంటే గెలిస్తే మధ్యలో ఈ పదవి వదిలి వెళ్లిపోయేవాడు కదా? అని ప్రశ్నించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవి అంటేనే రాంచందర్‌రావుకు చిన్న చూపని చెప్పారు. పట్టబద్రులకు సేవ చేయాలని అనుకుంటే ఎమ్మెల్యే, ఎంపీ పదవులకు ఎందుకు పోటీ చేసినట్లని ఆయన ప్రశ్నించారు. ఇప్పుడు ఓటు వేసి గెలిపిస్తే..మళ్లీ మధ్యలో వదిలి వెళ్లిపోవన్న గ్యారంటీ ఏంటని ప్రశ్నించారు. సురభి వాణి మాజీ ప్రధాని కూమార్తెగా, సంప్రదాయ కుటుంబం నుంచి వ్యక్తన్నారు. అలాగే విద్యావేత్త. విద్యారంగంలో ఎంతో సేవ చేసిన వ్యక్తి అని చెప్పారు. లెక్చరర్‌గా, ప్రొఫెసర్‌గా, కరస్పాండెంట్‌గా లక్ష మంది పట్టభద్రులను ఆమే సమాజానికి అందించారని చెప్పారు.

# జాతీయ రహదారుల నిర్మాణాలకు అటవీ అనుమతులు

**త్వరగా రోడ్ల పూర్తికి సహకరించేలా చర్యలు**

**అధికారులు సమావేశంలో వివిధ ప్రాజెక్టులపై చర్చ**

హైదరాబాద్,మార్చి4(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో వివిధ ప్రాంతాల గుండా వెళ్లే జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణం, త్వరిత గతిన పనులు, వేగంగా అటవీ అనుమతుల తాజా స్థితిపై అరణ్య భవన్ లో సమీక్షా సమావేశం జరిగింది. అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్) ఆర్. శోభ, జాతీయ రహదారుల సంస్థ సలహాదారు ఏ.కే.జైన్ హాజరయ్యారు. వివిధ దశల్లో ఉన్న 29 రోడ్ల అనుమతులు, పురోగతిపై ప్రధానంగా సమావేశంలో సమీక్షించారు. మొదటి దశ అనుమతులు, రెండో దశ అనుమతులకు కావాల్సిన పనులను వేగవంతంపై రెండు శాఖల మధ్య సమన్వయంపై చర్చ జరిగింది. సంగారెడ్డి, నాంధేడ్, అకోలా, హైదరాబాద్ – మన్నెగూడ, నిజామాబాద్ – జగదల్ పూర్, మంచిర్యాల– చెన్నూరు, హైదరాబాద్ – భూపాలపల్లి జాతీయ రహదారుల విస్తరణతో పాటు, ఇతర రోడ్ల అనుమతులపై సమావేశంలో వివరంగా చర్చించారు.

అలాగే అన్ని జాతీయ రహదారుల వెంట పచ్చదనం పెంపు, మల్టీ లెవల్ అవెన్యూ ఎ÷–లాంటేషన్ అభివృద్ధి మోడల్స్ పై చర్చించారు. కొన్ని రహదారుల వెంట కొద్ది కిలో మీటర్ల మేర ప్రాంతాలను ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్ట్ లో భాగంగా మల్టీ లెవల్ అవెన్యూ ఎ÷–లాంటేషన్ చేపట్టాలని, వాటి ఫలితాల ఆధారంగా విస్తరించాలని నిర్ణయించారు.సమావేశంలో పీసీసీఎఫ్ (సోషల్ ఫారెస్టీ) ఆర్.ఎం. డోబ్రియల్, జాతీయ రహదారుల సంస్థ ప్రాంతీయ అధికారి ఏ. కృష్ణ ప్రసాద్, ఎస్.కే. కుష్వాహా, జాయింట్ అడ్వయిజర్ కే.ఎస్. రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు ఎం. రవీందర్ రావు, పీ. సాగేశ్వర రావు, పీ. ధర్మారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ ప్రచార పోరు

**ఎవరికి వారే సారథులుగా ప్రచారం**

**పార్టీలో పట్టు సాధించాలన్న లక్ష్యంలో నేతలు**

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): తెలంగాణ కాంగ్రెస్‌కి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సవాల్‌గా నిలవబోతున్నాయి. నాయకత్వ లోపంతో ఉన్న పార్టీకి ఎవరికి వారు నాయకులై ఇప్పుడు ఎన్నికల తంతును నడిపిస్తున్నారు. వ్యూహాత్మక అడుగులు వేసేందుకు పార్టీ పరంగా ప్రణాళిక అన్నది లేకుండా ఉన్నట్లు కనిపిస్తోంది. రెండు పట్టభద్రుల నియోజకవర్గాల్లో పార్టీ బాధ్యతలను సీనియర్ నేతలు స్వయంగా భుజాలపై వేసుకున్నారు. పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డిలు చెరో నియోజక వర్గం బాధ్యతలు తీసుకుని ఎన్నికల కదనరంగంలోకి దిగారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గట్టెక్కించడం ఒక ఎత్తు అయితే.. పార్టీకి తమ సత్తా ఏంటో తెలియజేయడం మరో ఛాలెంజ్. దానిపైనే కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఓ వైపు అధికార టీఆర్ఎస్.. మరోవైపు బీజేపీ మధ్య కాంగ్రెస్ నలిగిపోతుంది. దీనికి నాయకుల మధ్య సమన్వయ లోపం కూడా తోడైంది. వరుస ఓటములతో ఇబ్బందుల్లో ఉన్న కాంగ్రెస్‌ని.. కోలుకోకుండా చేయాలని.. ఆ స్థానాన్ని ఆక్రమించాలని బీజేపీ ఆశపడుతోంది. ఇది గ్రహించిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడిప్పుడే పార్టీని గాడిలో పెట్టేందుకు ఎవరికి వారు యత్నాలు చేస్తున్నారు. నల్లగొండ– ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో ఉన్న నాయకులంతా కాంగ్రెస్ సీనియర్లే. పీసీసీ చీఫ్ ఉత్తమ్ మొదలుకొని జానారెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇక్కడే ఉన్నారు. ఖమ్మంలో భట్టి.. నల్లగొండ, వరంగల్‌లో పీసీసీ చీఫ్ ఎన్నికల ప్రచారంలో ఇప్పటికే బిజీ అయిపోయారు. కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఇక్కడ బరిలో ఉన్నారు. రాములు నాయక్ సామాజికవర్గం.. ఆయన్ని అభ్యర్థిగా ప్రకటిస్తూ పార్టీ తీసుకున్న నిర్ణయం కలిసి వస్తుందని కాంగ్రెస్ నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు.. ఇదే సమయంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు కలసి వస్తుందని వారి ఆశగా ఉంది. ఇప్పటికే ఆ దిశగా సీనియర్లు ప్రచారం ప్రారంభించారు.. విమర్శలకు పదును పెట్టారు.

హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో మాజీ మంత్రి చిన్నారెడ్డి బరిలో ఉన్నారు. మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డిది పాలమూరు జిల్లానే కావడంతో ఆయన ఎక్కువగా ప్రచారంలో కనిపిస్తున్నారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు బాధ్యతలను రేవంత్ భుజనాకెత్తుకున్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోని కేడర్‌తో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటూ.. నాయకులతో సమావేశమవుతూ ప్రచారంలో మునిగిపోయారు. మూడు జిల్లాల్లో ప్రచారం ఏవిధంగా సాగాలన్న షెడ్యూల్ సిద్ధం చేసుకుని ముందుకు సాగుతున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసే ప్రయత్నంలో రేవంత్ ఉన్నారు. టీఆర్ఎస్ నుంచి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమార్తె సురభివాణి బరిలో ఉండటంతో.. కాంగ్రెస్ ఓటు చీలకుండా అందుకు తగ్గట్టుగానే వ్యూహాలు రచిస్తున్నారు. వరస ఓటములతో కుదేలయిన కాంగ్రెస్‌ను గట్టెక్కించాలని పట్టుదలతో ఉత్తమ్ ఉంటే.. పీసీసీ చీఫ్ పీఠాన్ని ఎలాగైన ఈ విజయంతో అధిరోహించాలని రేవంత్ వ్యూహంగా కనిపిస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం.. వ్యూహాలు దానిచుట్టూనే తిరగుతున్నాయి. అయితే కాంగ్రెస్‌కు ఇప్పటికే ప్రజల్లో ఆదరణ తగ్గింది. వారు గమనించినా లేకున్నా, ఇప్పుడు టిఆర్ఎస్‌కు బిజెపి మాత్రమే పోటీ ఇవ్వగలదన్న ధృఢాభిప్రాయం ప్రజల్లో ఏర్పడింది.

# యాసంగి సీజన్‌లో పెరిగిన దిగుబడులు

**పంటల కొనుగోలు కేంద్రాలపై కానరాని స్పష్టత**

**అయోమయంలో అన్నదాతలు**

వరంగల్,మార్చి5(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటిస్తున్నప్పటికీ కొనుగోలు కేంద్రాలపై చివరి దాక దోబూచులాడుతుండడం అన్నదాతకు శాపమవుతోంది. ఈ సారి కూడా రైతులు వ్యవసాయశాఖ నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ఆయా పంటలను సాగుచేశారు.అన్ని ప్రాజెక్ట్‌ల్లో సాగునీటి నిల్వలు పుష్కలంగా ఉండడం, భూగర్భ జలాల లభ్యత కూడా ఆశించిన మేరకు ఉండడంతో రైతులు యాసంగి పంటలపై పెద్దఎత్తున ఆశలు పెట్టుకొని సాగుకు ఉపక్రమించారు. ప్రభుత్వం ఇప్పటి వరకు వరి కొనుగోలు కేంద్రాలపై స్పష్టమైన విధి విధానాలను, మార్గదర్శకాలను జారీ చేయకపోవడం వరి రైతును తీవ్రనిరాశకు గురిచేస్తోంది. కేంద్ర వ్యవసాయ చట్టాల ప్రకారం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తారో లేదోనన్న సందేహాలతో రైతులు సతమతమవుతున్నారు. అయితే కందిపంట కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలంటూ సంబంధిత యంత్రాంగాన్ని ఆదేశించినప్పటికీ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ కాకపోవడంతో అయోమయ పరిస్థితులు కనిపిస్తున్నాయి. అయితే శనగపంట విషయంలోనూ ఇదే అస్పష్టత కానవస్తోంది. ఇదిలా ఉండగా పంటల వివరాలను తప్పనిసరిగా సమగ్ర రైతు సర్వే పోర్టల్‌లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ పోర్టల్‌లో నమోదైన పంటలకే మద్దతు ధర చెల్లిస్తామని అలాగే ఆ పంటలను కొనుగోలు చేస్తామంటూ అధికారులు స్పష్టం చేస్తున్నారు. చాలామంది రైతులు అవగాహన లోపంతో సమగ్ర రైతు సర్వే పోర్టల్‌లో తాము సాగుచేస్తున్న పంటల వివరాలను నమోదు చేయించుకోలేదు. దీంతో పంట దిగుబడి వచ్చే సమయానికి మరింత గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో కేంద్ర సాగుచట్టాల ప్రకారం కొనుగోలు కేంద్రాలు ఉండబోవన్న ప్రచారం రైతులను కుంగదీస్తోంది. అయితే రైతులు మాత్రం కేంద్ర చట్టాలు రాష్ట్రంలో అమలు కావని ఇక్కడి సర్కారు ఎలాగైనా పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్న ధీమాతో ఉన్నారు. పంటలను కొనుగోలు చేసే వ్యవహారంపై ప్రభుత్వం కొన్ని నిబంధనలను పకడ్బందీగా అమలు చేయతలపెట్టింది. రైతుబంధు, పంట కొనుగోళ్లకు ముడిపెట్టబోతున్నట్లు సమాచారం. రైతులు తప్పనిసరిగా తమ పంటల సాగు వివరాలను సమగ్ర రైతు సర్వే పోర్టల్‌లో నమోదు చేయించుకోవాల్సి ఉంటుందంటున్నారు. పంటల సాగు వివరాలు ఈ పోర్టల్‌లో నమోదు కానట్లయితే ఆ పంటలను సర్కారు కేంద్రాల్లో కొనుగోళు చేయబోరని అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే చాలా మంది రైతులు అవగాహన లోపంతో తాము సాగు చేసిన పంటల వివరాలను సమగ్ర రైతు సర్వేపోర్టల్‌లో ఇప్పటికి కూడా నమోదు చేయించుకోలేదని చెబుతున్నారు. గ్రామీణస్థాయిలో ప్రచారం నిర్వహించకపోవడం సంబందిత శాఖల నిర్వాహకం కారణంగా రైతులు ఈ పోర్టల్ వైపు కన్నెత్తి చూడలేదంటున్నారు. ముఖ్యంగా వరి పంట విషయంలో పోర్టల్ నమోదు వ్యవహారం వివాదాలకు ఆస్కారమివ్వవచ్చుంటున్నారు. ఇప్పటికే 40శాతం రైతులు దళారులకు పంటలను అమ్ముకున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులు పండించిన శనగ దిగుబడులను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర అందించాలన్నారు.

# బంద్ సంపూర్ణం




**ఆర్టీసీ డిపోల ముందు కార్మిక సంఘాల బైఠాయింపు**

**బంద్ పిలుపుతో మూతపడ్డ వ్యాపార,వాణిజ్య సంస్థలు**

గుంటూరు,మార్చి5(ఆర్ఎన్ఎ): విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన బంద్‌లో వామపక్ష పార్టీలు పాల్గొన్నాయి. బంద్‌లో భాగంగా జిల్లాలోని ఆర్టీసీ డిపో ఎదురుగా వామపక్షాలు ధర్నాకు దిగాయి. మరోవైపు జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. కళాశాలలు, వ్యాపారసంస్థలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. వ్యాపార,వాణిజ్య సంస్థలు బంద్‌కు సహకరించాయి. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణని వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన బంద్‌ని జిల్లాలో విజయవంతం చేసేందుకు ప్రతిపక్షాలు ఆందోళనలకు దిగాయి. వైసీపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు బంద్‌లో ప్రత్యక్షంగా పాల్గొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఇంజనీరింగ్ కాలేజ్‌లకు శుక్రవారం సెలువు ప్రకటించాయి. వేకువజామునే ఆర్టీసీ బస్టాండ్ల వద్దకు చేరుకొని బస్సులు డిపోల నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు. అయితే ప్రభుత్వం బస్సులను నడపరాదని నిర్ణయించడంతో అవి డిపోలకే పరిమితం అయ్యాయి. వామ పక్ష పార్టీలతో పాటు తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలు బంద్‌కు సంఘీభావాన్ని ప్రకటించాయి. మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఈ బంద్‌ని విజయవంతం చేయడం ద్వారా మరింత ఒత్తిడిని పెంచాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. విశాఖ ఉక్కుతో జిల్లాకు అవినాభావ సంబంధం ఉంది. నాటి పోరాట ఉద్యమంలో అమృతరావు నడిపిన ఉద్యమం చరిత్రలో నిలిచిపోయింది. ఆయన స్ఫూర్తితో విశాఖ ఉక్కు ప్రైవేటుపరం కాకుండా అడ్డుకోవాలని బంద్‌లో పాల్గొన్న నేతలు బంద్‌ను విజయవంతం చేసేందుకు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు కూడా పాల్గొన్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ఉక్కు ఫ్యాక్టరీని ఇప్పుడు ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. బంద్‌తో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో శుక్రవారం జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేస్తూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. వాయిదా పడిన ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్షను ఈ నెల 6వ తేదీన, ఏంసీఏ ఐదో సెమిస్టర్ పరీక్షను ఈ నెల 8వ తేదీన, ఎమ్మెస్సీ నానోటెక్నాలజీ మూడవ సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్ష ఈ నెల 18వ తేదీన, ఎంబీఏ నాలుగో సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్ష ఈ నెల 27వ తేదీన జరుగుతాయని వర్సిటీ అధికారులు తెలిపారు.

# ఆదాయ వనరుగా ఉన్న సంస్థలకు ఎసరు

**కార్పోరేట్లకు లాభాలు కల్పించేలా తెగనమ్మే ప్రయత్నాలు**

**ఎల్ఐసి లాంటి సంస్థలను అప్పనంగా అప్పగించే యత్నాలు**

న్యూఢిల్లీ,మార్చి5(ఆర్ఎన్ఎ): వేలకోట్ల లాభాలతో ప్రజలకు ఉపాధి కల్పిస్తూ, ప్రభుత్వానికి ఆదాయవనరుగా ఉన్న ఎల్ఐసిని కూడా ప్రైవేటకరించడం పాడిగేదెను తెగనమ్మడం లాంటిదే. ప్రైవేటు ఇన్సూరెన్సు కంపెనీలు ప్రజల బీమా సొమ్మును ఇష్టం వచ్చినట్టు స్వాహా చేసి, క్లెయిములు ఎగ్గొట్టినప్పుడే వాటిని జాతీయం చేసి ప్రభుత్వరంగ ఎల్ఐసి ని స్థాపించారు. అదీ కేవలం రూ.5 కోట్ల పెట్టుబడితో ప్రరంభం అయిన జీవిత బీమ సంస్థ ఇప్పుడుమహా వృక్షంగా.వటవృక్షంగా ఎదిగింది. ఇది లక్షలాది మందికి నీడను ఇస్తోంది. ప్రపంచంలోని ఏ ఇతర ప్రైవేటు ఇన్సూరెన్సు కంపెనీకన్నా ఎక్కువ సామర్థ్యంతో పాలసీదారుల క్లెయిములను చెల్లిస్తోంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఏ ప్రైవేటు కంపెనీ బీమా సొమ్ము ఇవ్వదు. కాని ఎల్ఐసి ఇస్తుంది. కాని మోడీ ప్రభుత్వం మాత్రం ఎల్ఐసి కూడా తిరిగి ప్రైవేటు కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ప్రజల సొమ్మును గతంలో స్వాహా చేసిన ఘనత వహించిన ప్రైవేటు రంగానికే కట్టబెట్టడానికి రంగం సిద్ధం అయింది. పైగా ఇది ఏదో గొప్ప విధాన నిర్ణయం అయినట్టు బిజెపి నేతలు, పాలకులు జబ్బలు చరుచుకుంటున్నారు. ప్రైవేటు బ్యాంకులు దేశంలో పేదరిక నిర్మూలనకు ఏవిధంగానూ సహకరించడం లేదు. 1969లో బ్యాంకులను జాతీయం చేసింది? అప్పుడు ఆ నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తే బిజెపి మాతృసంస్థ భారతీయ జనసంఘం మాత్రం వ్యతిరేకించింది. కార్పొరేట్లకు ప్రజల సంపదను దోచిపెట్టడం అనేది ఆ పార్టీ రక్తంలోనే ఉందని ఇప్పటికి అర్థం అవుతోంది. ప్రైవేటు రంగంలో మొదలైన సింధియా నావిగేషన్ కంపెనీని యజమాని వాల్‌చంద్ హీరాచంద్ నడపలేక మొర పెట్టుకుంటే దానిని జాతీయం చేసి హిందూస్తాన్ షిప్‌యార్డుగా ఇప్పటికీ దిగ్విజయంగా నడుపుతున్నారు. మెరికన్ కంపెనీగా ఉండిన కాల్టలెక్స్ ఆయిల్ రిఫైనరీని జాతీయం చేసి హెచ్‌పిసిఎల్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ సంస్థ విస్తరించిన వైనం చూస్తే ప్రభుత్వ రంగం అంటే ఏమిటో తెలుస్తుంది. విశాఖ–చెన్నై కోస్టల్ కారిడార్ కి హెచ్‌పిసిఎల్ విస్తరణ పునాది. కొద్ది సంవత్సరాల క్రితం 'హిందుస్తాన్ జింక్' అనే ప్రభుత్వ రంగ సంస్థను 'వేదాంత' అనే ప్రైవేటు కంపెనీకి అమ్మేశారు. ఇప్పుడు 'వేదాంత' యజమాని ఆ జింక్ సంస్థను మూసేసి ఆ స్థలాలను సైతం అమ్మకానికి పెట్టాడు. ఇదీ ప్రైవేటు ఘనత, ఇక కాలుష్యంతో విశాఖ ప్రజలను పరుగులెత్తించిన ఘనత మరో ప్రైవేటు కంపెనీ 'ఎల్.జి పాలిమర్స్' కి చెందుతుంది. ప్రభుత్వ రంగమా, ప్రైవేటా అని చూడకుండా నష్టాలు వస్తే ఏంచేయాలని ఆలోచిస్తారు. నష్టాలు వచ్చిన ప్రైవేటు కంపెనీలను మాత్రం కాపాడతారు. విశాఖ ఉక్కుకు నష్టాలు వస్తుంటే అమ్మేయాల్సిందేనంటారు. ఇక్కడ బ్యాంకు అప్పులను మాఫీ చేయడం గురించి నోరు మెదపడం లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం విశాఖ ఉక్కు అమ్మకం నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో మనం ఉన్నాం. అంటే ప్రజాభిప్రాయాన్ని గౌరవించి దానికి అనుగుణంగా ప్రభుత్వాలు నడుచుకోవాలి. ప్రజల మనోభావాలు గాయపడడం గురించి బిజెపి నేతలే అందరికన్నా ఎక్కువగా మాట్లాడుతుంటారు. మరి ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలు మాత్రమే గాక పది కోట్ల మంది తెలుగు ప్రజల మనోభావాలు కూడా కేంద్రం నిర్ణయం కారణంగా గాయపడ్డాయి.

# జగిత్యాల జిల్లాలో కొత్తరకం వైరస్

**–వ్యక్తి హైదరాబాద్‌కు తరలింపు**

జగిత్యాల,మార్చి5(ఆర్ఎన్ఎ): జిల్లాలోని కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి కొత్త రకం కరోన లక్షణాలు బయటపడ్డాయి. దీంతో అనుమానంతో జిల్లాలో వైద్యాధికారులు అతడిని హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడు కొన్ని రోజుల క్రితం గల్ఫ్ నుండి వచ్చారు. గురువారం మాల్యాల మండలం ముత్యంపేటలోనూ కొత్తరకం కరోనా బయటపడింది. ఏడుగురికి కరోనాగా నిర్ధారణ అయ్యింది. బ్రిటన్ స్టెయిన్‌గా అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# విశాఖ ఉక్కు చరిత్ర తెలియని పాలకులు

**ప్రజల భావోద్వేగాలతో చెలగాటం**

**లాభాలు తెచ్చిన పెట్టిన పాడిగేదె**

విశాఖపట్టణం,మార్చి5(ఆర్ఎన్ఎ): దక్షిణాదిలో పాగా వేయాలనుకుంటున్న బిజెపి తనపై వ్యతిరేకతకు తానే ఆజ్యం పోసుకుంటోంది. ఎపిలో పాగా వేయాలన్న దాని సంకల్పాన్ని విశాఖ ఉక్కు దెబ్బకొడుతుందని చెప్పడంలో అతిశయోక్తి ఉండదు. పబ్లిక్ రంగ సంస్థలను అన్యాక్రాంతం చేసే కార్యక్రమం అన్ని ప్రభుత్వాలలో జరిగినప్పటికీ, మరీ తెగబడి వ్యవహరిస్తున్న ప్రస్తుత ప్రభుత్వానికి గట్టి ప్రతికూలత విశాఖ ఉక్కు ఉద్యమం నుంచి ఎదురుకానున్నదని తాజా ఉద్యమం నిరూపిస్తోంది. ఎదురు లేకుండా రెండోసారి అధికారం చేపట్టిన మోడీ ప్రభుత్వానికి ఢిల్లీలో రైతులు ఝలక్ ఇచ్చారు. బిజెపి తరహాలో సాగిపోతున్న సంస్కరణల రథానికి మొట్టమొదటిసారి పెద్ద ప్రతిఘటనను దేశరాజధానిలో రెండు నెలలుగా రైతుల ఆందోళనల రూపంలో చూస్తున్నాం. వ్యవసాయచట్టాలను సమర్థించేవారు కూడా రైతుల ఐక్యతను, దీక్షాబలాన్ని ప్రశంసిస్తున్నారు. ఆరేళ్లుగా తిరుగులేని నాయకత్వంతో ఉన్న కేంద్ర ప్రభుత్వం మొదటిసారిగా రైతు ఉద్యమంలో ప్రతికూలతలను, ఎదురుదెబ్బలను చవి చూస్తోంది. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఏకమొత్తంగా అమ్మేయాలనే నిర్ణయం వెనుక కుట్రలు లేదా, సొంత ప్రయోజనాలు దాగి ఉన్నాయని లెఫ్ట్ పార్టీల నేతలు మండిపడుతున్నారు.కేంద్ర మంత్రివర్గం అవగాహనారాహిత్యం, ఉక్కు చరిత్ర తెలియని అజ్ఞానం, ఏదైనా చేయగలమన్న అహంకారం కనిపిస్తున్నాయని ఉభయ కమ్యూనిస్ట్ పార్టీ కార్యదర్శులుపి.మధు, రామకృష్ణలు అన్నారు. ప్రాణాలొడ్డి పోరాడితే కానీ విశాఖ ఉక్కు సాకారం కాలేదు. దళిత నాయకుడు అమృతరావు సుదీర్ఘ దీక్ష చేసి ఉక్కు సంకల్పాన్ని సాధించారు. విద్యార్థులు, ఉద్యోగులు, యువకులు రోడ్లమీదకు వచ్చి జైళ్లకు పోయి, దెబ్బలు తిని, చచ్చిపోయి ఆ ఉద్యమాన్ని నిర్మించారు. ఇంతా చేసి, కేంద్రం పెట్టిన పెట్టుబడి 5 వేల కోట్లు మాత్రమే. ఈ మూడు దశాబ్దాలలో నలభైవేల కోట్లకు పైగానే డివిడెండ్లు, పన్నుల రూపంలో కేంద్రానికి అవి తిరిగి ముట్టినయి. లక్ష కోట్ల విలువైన స్థిరాస్తులు న్నాయి. భారీ ఉత్పత్తికి తగినంత సామర్థ్యమున్నది. ఈ మధ్య కాలంలో కొంత నష్టం వస్తున్నది. 2005 నుంచి 2014 దాకా వరుసగా లాభాలే వచ్చాయి. ప్రస్తుతం ఈ సంవత్సరంలో కూడా, పెరిగిన సామర్థ్యంతో లాభార్జన మొదలయింది. ఇరవైవేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి ఇస్తోంది. లక్షలాది మందికి పరోక్ష జీవనాధార్గా విశాఖ ఉక్కునిలిచింది. ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుతో విశాఖ రూపురేఖలు పూర్తిగా మారాయి. ఇవన్నీ గుర్తించకుండా, ఉక్కు నేపథ్యాన్ని గుర్తించకుండా మోడీ సర్కార్ చేస్తున్న ప్రయత్నాలను ప్రతిఘటనల ద్వారానే ఎదుర్కోవాలని లెఫ్ట్ కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. నేతల అవకాశ వాదం కారణంగా, పార్లమెంటులో హామీ ఇచ్చిన ప్రత్యేక హోదా దక్కలేదు. ఇప్పుడు ఉన్న గొప్ప ఆదెరువును కూడా అపహరించే ప్రయత్నం జరుగుతున్నది. సంకుచిత రాజకీయ ప్రయోజనాలను పక్కనబెట్టి, అన్ని పక్షాలూ ఏకమైతే తప్ప, ఒకే లక్ష్యసాధన పైనే గురిపెడితే తప్ప, ఈ ప్రమాదాన్ని నివారించలేరు.

# పోకిరీలను రహస్యంగా పట్టుకునేందుకు ప్రాధాన్యతనివ్వాలి

**నూతనోత్సాహంతో పనిచేసే షీబృందాల సభ్యులకు ప్రోత్సాహకాలు**

**–కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి**




కరీంనగర్, మార్చి 5: (నేటినిజం ప్రతినిధి):మహిళలు, విద్యార్థినినులకు భద్రతపై మరింత భరోసా కల్పించేందుకు పోకిరీలను రహస్యంగా పట్టుకునే చర్యలను ముమ్మరం చేయాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి షీటీంలను ఆదేశించారు. రహస్య ఆపరేషన్ల ద్వారా పోకిరీలను పట్టుకునేందుకు కంటికి కనిపించని ఆత్యాధునిక సాంకేతిక పరికరాలు షీబృందాలకు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

శుక్రవారం నాడు కమిషనరేట్ కేంద్రంలో షీబృందాలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ విద్యాసంస్థలు ప్రారంభమైనందున ఆయా ప్రాంతాలతో పాటు ఎక్కువమంది జమకూడి ఉండే ప్రదేశాల్లో షీబృందాలు రహస్య నిఘాను నిరంతరం కొనసాగించాలని ఆదేశించారు. రహస్యంగా నిర్వహించే చర్యల వల్ల పోకిరీల దృశ్యాలు నిక్షిప్తం కావడం వల్ల సదరు పోకిరీలు చట్టపరంగా శిక్షింపబడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. మహిళలు, విద్యార్థినులపై ఎక్కడ ఎలాంటి చిన్న సంఘటన జరిగినా పోలీస్‌శాఖ ప్రతిష్టకు భంగం కలిగే ప్రమాదం ఉంటుందనే విషయాన్ని బృందాల్లోని సభ్యులు గుర్తించాలని చెప్పారు. కమిషనరేట్ వ్యాప్తంగా మహిళలు, విద్యార్థినులపై ఎలాంటి చర్యలు జరిగినా, జరిగేందుకు అవకాశాలున్నా వెంటనే సమాచారం అందుకునేలా ప్రత్యేక సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోకిరీలను రహస్యంగా పట్టుకునేందుకే ప్రాధాన్యతనివ్వాలని చెప్పారు. ఎక్కువసంఖ్యలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడంతోపాట హాక్ఐ యాప్‌ను ఎక్కువమందితో డౌన్‌లోడ్ చేయించే వారికి రివార్డులను అందజేస్తామని ప్రకటించారు. షీబృందాలు నూతనోత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. షీటీంల పనితీరుపై సోషల్‌మీడియాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టాలని, ఇందులో షీటీంలు అందించే సేవలను తెలియజేయాలని సూచించారు. షీటీంల వాట్సాప్ నెంబర్ 9440795182 ప్రతి కార్యక్రమం సందర్భంగా ప్రదర్శించాలని చెప్పారు. కమిషనరేట్ వ్యాప్తంగా షీబృందాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని, పనితీరులో నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు శ్రద్ధాసక్తులు కనబర్చాలని తెలిపారు. ఉత్సాహంగా పనిచేసే షీటీంలకు చెందిన ప్రతి సభ్యులకు గుర్తింపు లభిస్తుందని చెప్పారు. వాట్సాప్, సెల్‌ఫోన్, ట్విట్టర్, ఫేస్‌బుక్‌ల ద్వారా సమాచారం అందినా వెంటనే స్పందిస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమాచారం అందించే వారి పేర్లను గోప్యంగా ఉంచడంతోపాటు కొన్ని సందర్భాలలో బాధితుల పేర్లను కూడా ఎక్కడా బయటకు రాకుండా పటిష్ట చర్యలు తీసుకుని సేవలందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి(పరిపాలన) జి చంద్రమోహన్, షీటీంల ఇంఛార్జి, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ దామోదర్‌రెడ్డి, ఐటిసెల్ ఇన్స్‌పెక్టర్ సిహెచ్ నటేష్‌లతోపాటుగా పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా విశాఖ ఉక్కు ఉద్యమం

**–శంకర్ విలాస్ వద్ద ప్రజా సంఘాల ఆందోళన**

గుంటూరు,మార్చి5(ఆర్ఎన్ఎ): విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ శుక్రవారం చేపట్టిన రాష్ట్ర బంద్ గుంటూరు జిల్లాలో ప్రశాంతంగా జరుగుతోంది. బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు ఈ బంద్‌లో పాల్గొన్నాయి. గుంటూరులోని శంకర్ విలాస్ సెంటర్‌లో వామపక్ష పార్టీల నేతలు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావుతోపాటు సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం త్యాగాల ఫలితంగా ఏర్పడిందన్నారు. అందుకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా బంద్ జరుగుతోందన్నారు. సీఎం జగన్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి.. ఢిల్లీకి తీసుకువెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ బంద్‌ను చూసైనా ప్రధాని మోదీ కళ్లు తెరవాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పట్ల కక్ష్యపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అన్ని రాజకీయపార్టీలు జెండాలను పక్కనపెట్టి ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం ముందుకు రావాలని పిలుపు ఇచ్చారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బంద్‌కు పూర్తి మద్దతు తెలిపి ఆందోళనలో పాల్గొంటున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ వెల్లడించారు. బంద్‌కు వైసీపీ మద్దతు తెలపడం శోచనీయమన్నారు. బస్సులు ఆపడంతోనే మద్దతు తెలిపినట్టు కాదని.. వైసీపీ శ్రేణులు బంద్‌లో పాల్గొని నిరసన తెలపాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చీకటి ఒప్పందమే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అని శ్రావణ్ కుమార్ తెలిపారు. కేంద్రం హోల్ సేల్‌గా అమ్మే ప్రయత్నం చేస్తుంటే రాష్ట్రం విడతల వారీగా అమ్మే ప్రయత్నం చేస్తోందన్నారు.ప్రైవేటీకరణను నిలిపివేసేంత వరకూ టీడీపీ ఆందోళన చేస్తుందని శ్రావణ్ పేర్కొన్నారు.

# బాలకృష్ణ మనుమలకు బాసరలో అక్షరాభ్యాసం

నిర్మల్,మార్చి5(ఆర్ఎన్ఎ): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు మనుమడు, నారా లోకేష్, బ్రాహ్మణిల కుమారుడు దేవాన్ష్‌కు శుక్రవారం బాసరలో అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాసం చేశారు. బ్రాహ్మణి తల్లి వసుంధర, ఇతర బంధువులతో కలిసి అమ్మవారి ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ఘన స్వాగతం పలికారు. దగ్గరుండి పూజా కార్యక్రమాలు చేయించారు. అలాగే బాలకృష్ణ రెండో అల్లుడు భరత్, అతని భార్య తేజస్విని, వారి కుమారుడు ఆర్యన్‌కు అక్షరాభ్యాసం చేయించారు.

# రాష్ట్రస్థాయి సెమినార్‌ను విజయవంతం చేయండి




రాజన్న సిరిసిల్ల, మార్చి 5: (నేటినిజం ప్రతినిధి):ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల ఆరవ తేదీన రెవిన్యూ గార్డెన్ లో జరిగే ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ఎదుర్కొంటున్న సవాళ్లు–ప్రతి సవాళ్లపై సెమినార్ నిర్వహించడం జరుగుతుందని ఈ సెమినార్ కు పెద్ద ఎత్తున మేధావులు,అంబేద్కర్ వాదులు, న్యాయవాదులు ఎస్సీ ఎస్టీ కుల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చందుర్తి మండల మాలమహానాడు సంఘం అధ్యక్షులు నీరటి శ్రీనివాస్ అన్నారు,

శుక్రవారం చందుర్తి మండల కేంద్రంలో ఈ సెమినార్కు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు, కరీంనగర్ లో జరిగే సెమినార్కు ఉమ్మడి హైకోర్టు విశ్రాంత జడ్జి కేసీ భాను హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంధం ప్రదీప్, అంబటి శ్రీధర్, వెదర్ శంకర్, బండి శ్రీనివాస్, నవీన్, రమేష్,అశోక్, బాబు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

# స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ ఫ్రేండ్ అఫ్ అవార్డు గ్రహీతకు సన్మానం



రాజన్న సిరిసిల్ల, మార్చి 5: (నేటినిజం ప్రతినిధి):స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ ఫ్రెండ్ ఆఫ్ అవార్డు అందుకున్న గంగారపు మల్లేశం ను శుక్రవారం ఇండియన్ ఐకాన్ అవార్డు గ్రహీత కవి రచయిత సామాజిక వేత్త రాష్ట్ర బీసీ ఎంప్లాయిస్ యూనియన్ కొ ఆర్డినేటర్ పసువుల రవికుమార్ సన్మానించారు .ఈ కార్యక్రమంలో విలేజ్ లైఫ్ సినిమా యూట్యూబ్ చానల్ అధినేత కీసర వెంకటస్వామి మాదాస్ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు

# యువకులు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలి



రాజన్న సిరిసిల్ల, మార్చి 5: (నేటినిజం ప్రతినిధి): గ్రామీణ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని మర్రిగడ్డ సర్పంచి నేతికుంట జలపతి అన్నారు, వేసవిలో మర్రిగడ్డ గ్రామానికి చెందిన యువకుల ఐకమత్యంగా క్రీడా పోటీలు నిర్వహణకు సన్నాహాలు చేస్తుండగా వీరికి క్రీడా సామాగ్రి కోసం శుక్రవారం గ్రామ సర్పంచి జలపతి రూపాయలు 5,000, ఎంపీటీసీ దారం కావ్య బాల్ రెడ్డి రూపాయలు 5000, ఉప సర్పంచి వెంకటరెడ్డి 2000ల ఆర్థిక సాయం అందజేశారు, యువకులు వేసవిలో చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు, ఈ కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు శ్రీకాంత్, రాజు, విక్కీ తదితరులు పాల్గొన్నారు,

# కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో గ్రామ కమిటీ నియామకం



రాజన్న సిరిసిల్ల, మార్చి 5: (నేటినిజం ప్రతినిధి):కోనరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో శుక్రవారం కొండాపూర్ గ్రామంలో నూతన గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటి ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షులుగా నేవూరీ రత్నాకర్ ఉపాధ్యక్షులు ఎక్కల దేవి కిషన్ ప్రధాన కార్యదర్శి మామిడి లింగారెడ్డి ప్రచార కార్యదర్శి తీగల వైకుంఠం కార్యదర్శి కుమ్మరి చందు ముఖ్య సలహాదారులు గడ్డం కిషన్ రెడ్డి దూస సత్యనారాయణ కార్యవర్గ సభ్యులు యశోద వేణు గొల్లపల్లి శ్రీనివాస్ తీగల మహేందర్ గడ్డం రత్నాకర్ కేతిరెడ్డి సురేందర్ రెడ్డి భాగ్యరెడ్డి మల్యాల పెద్దపల్లి భూమయ్య గొల్లపల్లి ప్రమోద్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో మాజీ సింగిల్విండో చైర్మన్ కేతిరెడ్డి లక్ష్మారెడ్డి జిల్లా నాయకులు చందనగిరి గోపాల్ తాళ్లపల్లి ప్రభాకర్ మండల నాయకులు గడిపల్లి ఎల్లయ్య యాదవ్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# బండి సంజయ్ కాదు..తొండి సంజయ్

### కౌన్సిల్‌ను అవమానించిన బండిని లోపల పడేయాలి
### ఇప్పుడు దేశమంతా మోడీలో వీరప్పన్‌ను చూస్తున్నారు
### టిఆర్ఎస్ ఎమ్మెల్యే గాదరి కిషోర్ సంచలన వ్యాఖ్యలు

నల్లగొండ,మార్చి5(ఆర్ఎన్ఎ): శాసన మండలిని అవమానపరిచే విధంగా బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ మాట్లాడుతున్నారని.. కౌన్సిల్‌ని కించరిపచే విధంగా మాట్లాడినందుకు సంజయ్‌ని అరెస్ట్ చేసి లోపల వేయాలని టిఆర్ఎస్ ఎమ్మెల్యే గాదరి కిషోర్ డిమాండ్ చేశారు. బీజేపీ బ్రోకర్ల జనతా పార్టీగా తయారైందని.. బీజేపీ అధ్యక్షుడు మాట్లాడే మాటలు రాష్ట్ర ప్రజలకు అర్థం కావడం లేదని చురకలు అంటించారు. బండి సంజయ్ కి ఓటు హక్కు ఉందో లేదో తెలియదని... బండి సంజయ్ పేరు...తొండి సంజయ్ అని పిలవాలని ఎద్దేవా చేశారు. ఈ మేరకు టిఆర్ఎస్ ఎమ్మెల్యే గాదరి కిషోర్ మరోసారి బండి సంజయ్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ ఎప్పుడైనా కరీంనగర్ దాటి హైదరాబాద్ వచ్చిండా? బీజేపీ అధ్యక్ష పదవి బండి సంజయ్‌కి రావడానికి కారణం కేసీఆరేనని పేర్కొన్నారు. అందుకోసం పొద్దున లేచి కేసీఆర్ కాళ్లకు దండం పెట్టాలన్నారు. ఐటీఐఆర్ కాన్సెప్ట్ నే కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందనేది సంజయ్ తెలుసుకోవాలని... విశాఖ ఫ్యాక్టరీని ఆనాటి రేటుకు ప్రైవేట్ సంస్థలకు అమ్మడానికి కుట్ర చేస్తుందని ఫైర్ అయ్యారు. మోడీలో వీరప్పన్‌ను చూస్తున్నామని వీరప్పన్ కూతురు అన్నది..అయితే ఇప్పుడు దేశమంతా మోడీలో వీరప్పన్ ను చూస్తుందని మండిపడ్డారు. తెలంగాణ గురించి పార్లమెంటులో బండి సంజయ్ ఒక్కరోజు కూడా మాట్లాడలేదన్నారు.

# చాయ్ అమ్మిన వ్యక్తి.. ఇప్పుడు రైల్వేలనే అమ్ముతున్నాడు

### బిజెపి తీరుపై మండిపడ్డ మంత్రి సత్యవతి

మహబూబాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): ఒకప్పుడు రైల్వే స్టేషన్‌లో చాయ్ అమ్మిన మోదీ.. ఇప్పుడు మొత్తం రైల్వే వ్యవస్థనే ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మంత్రి సత్యవతి రాథోడ్ ఆరోపించారు. దేశ సంపదను అదాని, అంబానీలకు దోచిపెడుతున్న బీజేపీ నాయకులు.. సీఎం కేసీఆర్ జైలుకు పోతాడంటూ చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర మంత్రులు రాష్ట్రంలో అమలవుతున్న పథకలను పొగుడుతుండగా, ఆపార్టీకి చెందిన రాష్ట్ర నాయకులు మాత్రం విమర్శలు చేస్తున్నారని వెల్లడించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికికి, మహబూబాబాద్ జిల్లాకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో ఉన్న అంశాలను కేంద్రం ఏ ఒక్కటీ అమలుచేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పూర్తికాని పోలవరం కనిపిస్తుంది కానీ, బీడువారిన నేలను తడిపిన కాళేశ్వరం ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రతీ విషయంలో రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బీజేపీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లడిగే హక్కు లేదన్నారు. ఈనెల 14న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఖమ్మం–వరంగల్–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ టీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డిని మొదటి ప్రాధాన్యతా ఓటుతో గెలిపించాలని కోరారు.

# పదిమంది హోటల్ సిబ్బందికి కరోనా

### అక్కడికి వెళ్లిన వారిలో తీవ్ర ఆందోళన

వ ు ం బ ై , వ ా ర ి ్చ 5 (ఆర్ఎన్ఎ):మహారాష్ట్రలో కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. కేసులు పెరుగుతుండటంతో కొన్ని జిల్లాల్లో ఇప్పటికే నైట్ కర్ఫ్యూ, లాక్‌డౌన్ అమలు చేస్తున్నారు. తాజాగా ముంబైలో ఓ హోటల్ సిబ్బందికి కరోనా రావడంతో.. ఆ హోటల్‌కి వెళ్లిన వారంతా తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ముంబైలోని అంధేరి (వెస్ట్) లోని ఎస్వీ రోడ్‌లో ఉన్న రాధా కృష్ణ రెస్టారెంట్‌లో పనిచేసే 10 మంది సిబ్బంది కరోనా బారినపడ్డారు. వీరందరినీ చికిత్స కోసం బీకేసీ జంబో కోవిడ్ సెంటర్‌కు తరలించారు. వెంటనే బృహన్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) హోటల్ చుట్టపక్కల ప్రాంతాలను శానిటైజ్ చేసి.. హోటల్‌ను క్లోజ్ చేశారు. ఇదేవిధంగా గత వారం హోటల్ ఎక్స్‌ప్రెస్ ఇన్‌లో పనిచేసే 21 మందికి కరోనా పాజిటివ్‌గా తేలింది.

# కులమత రాజకీయాలతో రెచ్చగొడుతున్న బిజెపి

### ఏటా రెండుకోట్ల ఉద్యోగాల పేరుతో మోసం
### ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మడం దారుణం
### ఎమ్మెల్సీ ప్రచారంలో మంత్రి శ్రీనివాసగౌడ్

మహబూబ్‌నగర్,మార్చి5(ఆర్ఎన్ఎ): కుల, మత రాజకీయాలతో భారతీయ జనతా పార్టీ యువతను రెచ్చగొడుతున్నదని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడికి పోయాయని విమర్శించారు.

లాభాల్లో ఉన్న ఎల్ఐసీతోపాటు రైల్వే, బీఎస్ఎన్ఎల్, విద్యుత్ సంస్థలను ప్రైవేట్ పరంచేయడం ద్వారా ప్రధాని మోదీ.. ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని ఆ ం ్ల ం చ ా ం ు . మహబూబ్‌నగర్–హైదరాబాద్–రంగారెడ్డి నియోజకర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలో జరిగిన సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. గతంలో ఇక్కడ గెలుపొందిన ప్రొఫెసర్ నాగేశ్వర్, రాంచందర్ రావులు పట్టభద్రులకు చేసిందేమీ లేదన్నారు. ఈసారి టీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సురభీ వాణీదేవిని గెలిపించాలని కోరారు.

రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ రాష్ట్ర అభివృద్ధికి తీసుకున్న చర్యలు, సంక్షేమ కార్యక్రమాలు, అమలుచేస్తున్న పథకాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనపై మంత్రి వివరించారు.

గత ప్రభుత్వాలు మహబూబ్‌నగర్ జిల్లాను నిర్లక్ష్యం చేశాయన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చేసిందేమి లేదని విమర్శించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష 30 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిందని చెప్పారు. నెలరోజుల్లోనే 50 వేలకుపైగా అర్హులైన ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కిందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉద్యోగాల కల్పనకు చేసిందేమి లేదన్నారు.

# సీఎస్ సోమేశ్‌కుమార్‌తో ఈస్తోనియా అంబాసిడర్ భేటీ

హైదరాబాద్, మార్చి 5: ఈస్తోనియా అంబాసిడర్ కార్టిన్ కివి, డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ జూహి హియో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌ను శుక్రవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో అమలు అవుతున్న అభివృద్ధి, సంక్షేమం, సంస్కరణలను వారికి వివరించారు. ఇందులో భాగంగా చేపట్టిన ల్యాండ్ రికార్డ్స్ డిజిటలైజేషన్, ఇ–గవర్నెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి విషయాలను ఉదహరించారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు కల్పించిన అవకాశాలను ఉపయోగించుకుని తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని ఈస్తోనియా డెలిగేట్స్‌ను సీఎం కోరారు. ఈ సమావేశంలో ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ, ప్రోటోకాల్ జాయింట్ సెక్రటరి అర్విందర్ సింగ్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# అయ్యప్పనుమ్ కోషియమ్ రీమేక్ ఫోటోల లీక్

సినీ పరిశ్రమకు లీకుల బెడద చాలా ఎక్కువైంది. సినిమా సెట్స్ పై ఉండగా, కొన్ని ఫోటోలు బయటకు వస్తుంటే, మరి కొన్ని ఎడిటింగ్ సమయంలో లీక్ అవుతున్నాయి. దీనిపై దర్శక నిర్మాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రీసెంట్‌గా యంగ్ టైగర్ ఎన్టీఆర్ బెంగాల్ పులితో పోరాటానికి సంబంధించిన క్యూరియస్ ఫోటో లీకైపోవడం కలకలం రేపింది. ఇక ఇప్పుడు పవన్ కళ్యాణ్– రానా ప్రధాన పాత్రలలో తెరకెక్కుతున్న అయ్యప్పనుమ్ కోషియమ్ రీమేక్‌కు సంబంధించిన ఫొటో ఒకటి బయటకు వచ్చింది. మాతృకలో పృథ్వీరాజ్ – బిజు మీనన్ లాంటి స్టార్లు పోషించిన పాత్రల్లోనే పవన్ – రానా నటిస్తున్నారు. సాగర్ కె చంద్ర తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి త్రివిక్రమ్ మాటలు అందిస్తున్నారు. హైదరాబాద్ శివార్లలో వేసిన సెట్‌లో మూవీ చిత్రీకరణ జరుగుతున్నట్టు తెలుస్తుండగా, సెట్ నుండి ఫొటో లీకైంది. ఇందులో పవన్ వెనుక పోలీసులు లాఠీలు పట్టుకొని కనిపిస్తున్నారు. ఈ ఫొటో అభిమానులలో సినిమాపై ఆసక్తిని కలిగిస్తుంది. శివరాత్రి సందర్భంగా మూవీ నుండి సర్‌ప్రైజ్ రానుందని తెలుస్తుంది.



# 11న విడుదలకు సిద్ధం అవుతున్న శ్రీకారం




హిట్, ఫ్లాప్స్‌తో సంబంధం లేకుండా వైవిధ్యమైన సినిమాలు చేస్తూ పోతున్న యంగ్ హీరో శర్వానంద్.

ప్రస్తుతం శర్వా ..శ్రీకారం, మహాసముద్రం అనే రెండు క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు. శ్రీకారం చిత్రం మార్చి 11న శివరాత్రి కానుకగా విడుదల కానుంది. రిలీజ్ దగ్గర పడుతున్న క్రమంలో మేకర్స్ మూవీ ప్రమోషన్స్‌ని వేగవంతం చేశారు. ఈ క్రమంలో ట్రైలర్ విడుదలకు టైం ఫిక్స్ చేశారు. రైతుల సమస్యలే ప్రధానాంశంగా.. రైతు గొప్పతనమే ఇతివృత్తంగా శ్రీకారం సినిమాను తెరకెక్కిస్తున్నాడు కొత్త దర్శకుడు బి కిషోర్. ఇప్పటికే చిత్ర టీజర్ విడుదల కాగా, ఇందులో తినేవాళ్లు నెత్తిమీద జుట్టు అంత ఉంటే.. పండించేవాళ్లు మూతిమీద మీసం అంతమంది కూడా లేరు అంటూ సాయిమాధవ్ బుర్రా రాసిన అద్భుతమైన మాటలు బాగున్నాయి. చిత్రంలో ర్వాకు జోడీగా గ్యాంగ్ లీడర్ ఫేమ్ ప్రియాంక మోహన్ నటిస్తుంది.

# కార్తికేయకు సీక్వెల్



యువ హీరో నిఖిల్ ప్రధాన పాత్రలో చందూ మొండేటి తెరకెక్కించిన చిత్రం కార్తికేయ. బాక్సాఫీస్ దగ్గర భారీ విజయం సాధించిన కార్తికేయ చిత్రానికి సీక్వెల్‌గా ఇప్పుడు కార్తికేయ 2 మూవీ రూపొందనుంది. కొద్ది రోజుల క్రితం ఈ మూవీ అఫీషియల్ ప్రకటన చేశారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ – అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్లపై టీజీ విశ్వప్రసాద్ – అభిషేక్ అగర్వాల్ – వివేక్ కూచిభోట్ల ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. అనుపమ పరమేశ్వరన్ ఇందులో కథానాయికగా నటించనుంది. కార్తికేయ 2 చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఎప్పుడో పూర్తి కాగా, ఇప్పుడు సినిమాను ఎప్పుడు సెట్స్ పైకి తీసుకెళతారా అని అభిమానులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో మూవీకి సంబంధించిన అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. తొలి షెడ్యూల్‌ని గుజరాత్ రాష్ట్రంలోని ద్వారకా నగరంలో మొదలు పెట్ట బోతున్నారు. ఇప్పటికే డైరెక్టర్ చందు మొండేటి ,కెమెరామెన్ కార్తీక్ ఘట్టమనేని తమ టీమ్ తో కలిసి ద్వారాకలో షూటింగ్ కోసం అనువైన ప్రదేశాల కోసం వేట సాగించారు. అనువైన ప్రదేశాలు చూసాక షూటింగ్ మొదలు పెట్టనున్నారు. కొన్ని వేల సంవత్సరాల క్రితం నాటి రహస్యం ఆధారంగా సరికొత్త పాయింట్‌తో థ్రిల్లింగ్‌గా కార్తికేయ 2 చిత్రాన్ని తెరకెక్కించనున్నారు.

# బాడీ బిల్డర్‌కు ఆర్థిక సాయం

### ప్రైవేట్ సంస్థ ద్వారా అందచేసిన ప్రభుత్వం
### అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు ప్రోత్సాహం

అమరావతి,మార్చి5(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నిశ్శంకరరావు రవికుమార్ అనే బాడీ బిల్డర్ కు ప్రభుత్వం తరపున ఆర్థిక అండదండలు లభించాయి.

నాలుగు నెలల క్రితం హోం మంత్రి మేకతోటి సుచరిత స్వగ్రామానికి చెందిన రవి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు.

ప్రపంచ స్థాయి దేహదారుఢ్య పోటీలకు సన్నద్ధమయ్యేందుకు కావలసిన ఆర్థిక సాయాన్ని అందించమంటూ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

అయితే తన కేబినెట్ మంత్రులలో దేహధారుఢ్యంపై ఆసక్తి కలిగిన పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి అప్పటికే అక్కడ ఉండడంతో సీఎం ఆ బాధ్యత మంత్రి మేకపాటికి అప్పగించారు. గుంటూరుకు చెందిన బాడీ బిల్డర్ రవికుమార్ గత సంవత్సరం అక్టోబర్ 20వ తేదీన ముఖ్యమంత్రిని కలిశారు. రవికుమార్ ఆ మరుసటి రోజునే సచివాలయంలోని మంత్రి ఛాంబర్ లో మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డితో సమావేశమయ్యారు.

2015 నుంచి ఇలాంటి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పురస్కారాలు అందుకున్నారు రవికుమార్. 2018లో పుణెలో జరిగిన అంతర్జాతీయ స్థాయి (75కేజీలు) ఆసియా బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ లో కాంస్య పతకం సాధించినట్లు మంత్రి మేకపాటికి వెల్లడించారు.

సీఎం ఆదేశాల ప్రకారం సీఎస్ఆర్ నిధుల ద్వారా ఆర్జాస్ స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా రవికి అవసరమైన సాయానికి పరిశ్రమల శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రతి నెలా రూ.70వేల చొప్పున సంవత్సరంలోగా రూ. 7లక్షల ఆర్థిక సాయం అందనుంది.

అంతేకాకుండా, నవంబరులో దక్షిణ కొరియాలో జరగబోయే పోటీలకు కావలసిన ప్రయాణ ఖర్చు సహా కనీస వసతులను మరో రూ. 2లక్షలుగా 'ఆర్జాస్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్' అందించనుంది.

సామాజిక బాధ్యతలో భాగస్వామ్యమైన అనంతపురం జిల్లా తాడిపత్రిలోని ఆర్జాస్ స్టీల్ సంస్థ ఎండీ శ్రీధర్ కృష్ణమూర్తిని మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి అభినందించారు. గతంలోనూ ఎన్నో మంచి పనులకు సీఎస్ఆర్ నిధులు ఇచ్చి ప్రోత్సాహించిన ఆర్జాస్ స్టీల్ మళ్ళీ సాయానికి ముందుకు రావడాన్ని మంత్రి కొనియాడారు. పరిశ్రమల శాఖను, ముఖ్యంగా డైరెక్టర్ సుబ్రహ్మణ్యం జవ్వాది చొరవను కూడా మంత్రి గౌతమ్ రెడ్డి మెచ్చుకున్నారు.

పోటీలకు సన్నద్ధమవుతున్న రవికి మంత్రి పలు సంస్థల ద్వారా బ్రాండింగ్ కూడా అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

ప్రపంచ స్థాయి దేహదారుఢ్య పరీక్షల్లో పసిడి పతకం సాధిస్తానని ఈ సందర్భంగా బాడీ బిల్డర్ రవి పేర్కొన్నారు. అండగా నిలిచిన ముఖ్యమంత్రి, మంత్రి మేకపాటి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం జవ్వాది, ఆర్జాస్ స్టీల్ కంపెనీకి బాడీబిల్డర్ రవి కృతజ్ఞతలు తెలిపారు.

# తరచుగా విద్యుత్ అంతరాయం

### వెంటనే జనరేటర్ ఏర్పాటు చేయాలన్న మేయర్

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): విద్యుత్ అంతరాయం కలుగకుండా తన క్యాంప్ ఆఫీస్‌లో వెంటనే 25 కేవీ జనరేటర్‌ను ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను మేయర్ విజయలక్ష్మి కోరారు. తన క్యాంప్ ఆఫీస్‌లో తరచుగా విద్యుత్ అంతరాయం కల్గడంపై మేయర్ విజయలక్ష్మి ఆరా తీశారు. విద్యుత్ అంతరాయం పై జీహెచ్ఎంసీ కమిషనర్‌కు మేయర్ విజయలక్ష్మి ÷ల్ పంపారు. విద్యుత్ అంతరాయంతో తన క్యాంప్ ఆఫీస్‌లో రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బంది కలుగుతుందని దానిలో వెల్లడించారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా తన క్యాంప్ ఆఫీస్‌లో 25 కేవీ జనరేటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను మేయర్ కోరారు.

# కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కోసం పోరాడుతా

### –కేంద్రం దిగివచ్చే వరకు ఎంతకైనా తెగిస్తా: ఎర్రబెల్లి

హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): కాజీపేట రైల్‌కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అవసరం లేదన్న కేంద్రంపై ఇక పోరాటం చేయకతప్పదని రాష్ట్రపంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కేంద్రం తీరుపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ విషయంలో ఉపేక్షించేది లేదన్నారు. అందుకోసం తాను ఎంతటి త్యాగానికైనా సిద్దమన్నారు. సమాచార హక్కుచట్టం ప్రశ్నకు రైల్వేకోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటు వసరం లేదని కేంద్ర రైల్వేశాఖ చెప్పడం సిగ్గుచేటని ఆయన దుయ్యబట్టారు. బీజేపీ తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్‌చేశారు. ఏం ముఖం పెట్టుకుని ప్రజలను ఓట్లు అడుగుతారని ఆయన ప్రశ్నించారు. ఇంకా ఎన్నిఅబద్దాలు ఆడతారు? తెలంగాణ ప్రజల్ని ఎంత కాలం మోసం చేస్తారని ఆయన ప్రశ్నించారు. బీజేపీ అంటే భారతీయ బొంకుడుపార్టీ అని తేలిపోయిందని మంత్రి ఎర్రబెల్లి చెప్పారు. టీఆర్ఎస్ పార్టీ త్యాగాల పునాదులమీద తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తుంటే బీజేపీ అబద్దాల పునాదులపై అధికారం కోసం అర్రులుచాస్తోందని విమర్శించారు. ఇప్పటి దాకా బీజేపీ బండి, గుండు, తొండి మాటలతో ప్రజల చెవుల్లోపువ్వులుపెట్టారని అన్నారు. ఇప్పుడు ఏకంగా రాష్ట్ర బీజేపీ చెవుల్లో కేంద్రం పువ్వులు పెట్టిందనారు. తెలంగాణకు అన్యాయంచేయడం బీజేపీకి అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. ఐటీఐఆర్ ప్రాజెక్టు మాదిరిగానే కాజీపేట రైల్ కోచ్ ఫ్యాక్టరీకి బిజెపి మంగళం పాడిందన్నారు. కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని పలు మార్లు కేంద్రాన్నిసీఎంకేసీఆర్ కోరారని గుర్తుచేశారు. తెలంగాణకు దక్కాల్సిన రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ సాధన కోసం ఉద్యమిస్తామని ఈసందర్భంగా మంత్రి ఎర్రబెల్లి స్పష్టంచేశారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.